


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAAMUDHRA
RNI No: TELTEL/2024/86684

## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575

మేడ్చల్-మల్కాజ్‌గిరి | శుక్రవారం | 23.01.2026 | సంపుటి : 2 | సంచిక :347 | పేజీలు : 8 | వెల : 2/-
MEDCHAL-MALKAJGIRI  Friday  23.01.2026  volume : 2  Issue : 347  Pages : 8  Cost : 2/-

### ధాన్యం దిగుబడి, కొనుగోలు

# రెండు రికార్డులు మావే..



**25 సంవత్సరాలలో ఇదే అత్యధిక రికార్డ్**

**తెలంగాణ రైతాంగం భాగస్వామ్యంతోటే ఇంతటి విజయం**

**ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యంతో 14.20 లక్షల మంది రైతులకు లబ్ది**

**బోనస్ తో కలిపి చెల్లించిన మద్దతు ధర మొత్తం 18,532.98 కోట్ల చెల్లింపు**

**వరి కొనుగోలులో అగ్రస్థానంలో నిజమాబాద్,నల్లగొండ జిల్లాలు**

**పౌర సరఫరాల, నీటిపారుదల, వ్యవసాయ శాఖల విజయమన్న మంత్రి ఉత్తమ్**

హైదరాబాద్, జనవరి 22 : తెలంగాణా రాష్ట్రం ధాన్యం దిగుబడిలోనే కాకుండా ఖరీఫ్ సీజన్ లో కొనుగోలు చెందిన ధాన్యం దేశచరిత్రలోనే ఆల్ టైం రికార్డ్ నమోదు చేసుకుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గడిచిన 25 సంవత్సరాల వ్యవధిలో ఇదే అత్యధిక రికార్డ్ అని ఆయన చెప్పారు. 2025-26 రబీ సీజన్ ధాన్యం కొనుగోలుకై పౌర సరఫరా శాఖా రూపొందించిన ప్రణాలికలపై గురువారం రోజున బేగంపేట ఐ.ఏ.ఎస్.ఆఫీసర్స్ అసోసియేషన్ బిల్డింగ్ లో జరిగిన సమీక్ష సమావేశానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

-మిగతా 2 లో..



## విజయ్ పార్టీ గురుతు 'విజిల్'

కేటాయించిన ఎన్నికల సంఘం



లోయలో పడిన ఆర్మీ వాహనం..

## 10 మంది మృతి



ప్రపంచంలో రెండో అత్యంత ట్రాఫిక్ రద్దీ నగరంగా

## బెంగళూరు

### 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ

# తెలంగాణ రైజింగ్ విజన్ లక్ష్యం

**హైదరాబాద్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఫాలో అప్ సదస్సు నిర్వహించాలి**

**ఎకనమిక్ ఫోరమ్ ఎండి జెరెమితో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ**

**తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను వివరించిన సిఎం**

**3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ రోడ్‌మ్యాప్‌పై వివరణ**



స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఎండీ జెరెమి జర్గెన్స్‌తో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. ఏటా హైదరాబాద్‌లో ఫాలోఅప్ సదస్సు నిర్వహించాలని కోరారు. త్వరలో దీనిపై నిర్ణయం తీసుకుంటామని ఎకనామిక్ ఫోరం బృందం ఆయనకు తెలిపింది. సీ4ఐఆర్ నెట్‌వర్క్ కోఆర్డినేషన్ హెడ్ మంజు జార్జ్‌తోనూ సీఎం భేటీ అయ్యారు.

హైదరాబాద్,జనవరి 22 : తెలంగాణ రైజింగ్ విజన్ లక్ష్యాలను రేవంత్ వివరించారు. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే రోడ్‌మ్యాప్‌ను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. దావోస్ లో జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో ఏర్పాటు చేసిన తెలంగాణ పెవిలియన్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ మేనేజింగ్ డైరెక్టర్ జెరెమిజర్గెన్స్, అ4ఐఆర్ నెట్‌వర్క్ కోఆర్డినేషన్ హెడ్ మంజు

-మిగతా 2 లో..

### రూ.5వేల కోట్ల పెట్టుబడులు..

# 4వేల మందికి ఉపాధి

**ఫ్యూచర్ సిటీలో 100 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్**

**యూపీసీ వోల్ట్ తో తెలంగాణ ఒప్పందం**

హైదరాబాద్, జనవరి 22 : దేశంలోనే తెలంగాణను ఏఐ డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక పెట్టుబడిని సాధించింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి

-మిగతా 2 లో..



### ఫోన్ ట్యాపింగ్ కేసులో

# కీలక పరిణామం



## కేటీఆర్‌కు సిట్ నోటీసులు

**నేడు 11 గంటలకు విచారణకు హాజరు కావాలని ఆదేశం**

**ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో దూకుడు పెంచిన సిట్ అధికారులు తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నోటీసులు జారీ చేశారు. శుక్రవారం నాడు ఉదయం 11:00 గంటలకు జూబ్లీహిల్స్‌లోని ఏసీపీ కార్యాలయంలో విచారణకు హాజరవ్వాలంటూ కేటీఆర్‌కు నోటీసులిచ్చారు. సీఆర్‌పీసీ 160 కింద నందినగర్‌లోని కేటీఆర్ నివాసంలో ఈ నోటీసులను సిట్ అధికారులు అందజేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీ నేతల ఫోన్లను ట్యాప్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి.**

హైదరాబాద్, జనవరి 22 : ఈ వ్యవహారంపై సిట్ అధికారులు కేటీఆర్‌ను ప్రశ్నించనున్నారు. తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం దేశ వ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన విషయం

-మిగతా 2 లో..




### తెలుగు సినిమాలకు

# గద్దర్ అవార్డులు

**ఫిబ్రవరి 3లోగా దరఖాస్తులకు ఆహ్వానం**

హైదరాబాద్, జనవరి 22 : 2025 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ద్వారా సర్టిఫికేషన్ పొందిన చిత్రాలకు తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్-2025 ప్రదానం చేయనున్నట్లు రాష్ట్ర చలనచిత్ర పరిశ్రమాభివృద్ధి సంస్థ

-మిగతా 2 లో..

# ఇందిరమ్మ ఇళ్లు కట్టుకోండి

**బిల్లులు ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిది**

**డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క హామీ**



కొమురం భీం, జనవరి 22 : ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడమే కాదు వారం వారం బిల్లు ఇస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ లబ్ది దారులు ఏ ఒక్కరోజు ఆలస్యం చేయకండి. వడివడిగా ఇండ్లు కట్టుకోండి.. బిల్లు ఇచ్చే బాధ్యత మా ప్రభుత్వానిదే అని భట్టి తెలిపారు. జైనూర్

-మిగతా 2 లో..



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 150 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 177 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 257 (కిలో) |
| స్కిన్ లెస్ | 292 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹68

# మేడారం జాతరకు భారీ ఏర్పాట్లు

**జాతరకు ముందే తరలివస్తున్న భక్తులు**

**బెల్లం కొరుగోళ్లకు విపరీతమైన గిరాకీ**

ములుగు, జనవరి 22 : మేడారంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను చేసింది. ఈ ఏడాది జనవరి 28 నుంచి జనవరి 31 వరకు జరగనుంది. కోట్లాది మంది భక్తులు వనదేవతలను దర్శించుకునేందుకు వస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం 4వేల ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఈసారి రికార్డు స్థాయిలో భక్తులు

-మిగతా 2 లో..



# నైని కోల్ బ్లాక్ టెండర్లపై విచారణ

**సింగరేణిపై కేంద్రం సంచలన నిర్ణయం**

**ఇద్దరు సభ్యులతో కూడిన బృందం ఏర్పాటు**

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆదేశం**

న్యూఢిల్లీ, జనవరి 22 : తెలంగాణలో సంచలనం సృష్టిస్తోన్న నైని కోల్ బ్లాక్ టెండర్లపై విచారణ చేపట్టాలని కేంద్రం నిర్ణయించింది. నైని కోల్ బ్లాక్ విషయంలో వివాదం తలెత్తిన నేపథ్యంలో కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు ఇద్దరు సభ్యులతో కూడిన కేంద్ర బొగ్గు శాఖ అధికారుల బృందం సింగరేణిలో పర్యటించనుంది. వివాదానికి, టెండర్ రద్దు చేయడానికి

-మిగతా 2 లో..



## సింగరేణిపై కేంద్రం
# సంచలన నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)

గల కారణాలు సహా ఇతర అంశాలపైనా సింగరేణి అధికారులతో కలిసి ఈ బృందం దర్యాప్తు చేయనుంది. ఈ బృందంలో బొగ్గు శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ చేతనా శుక్లా, బొగ్గు శాఖ టెక్నికల్ డైరెక్టర్ మారపల్లి వెంకటేశ్వర్లు సభ్యులుగా ఉన్నారు. ఈ బృందానికి కేంద్రం మూడు రోజుల సమయం ఇచ్చింది . మూడు రోజుల్లో సింగరేణిలో పర్యటించి.. నైని కోల్ బ్లాక్ టెండర్ రద్దుకు గల కారణాలపై విచారణ జరిపి.. ఆ నివేదికను కేంద్రానికి అందజేయాల్సి ఉంటుంది. ఒడిశాలోని నైని కోల్ బ్లాక్ టెండర్ల విషయంలో తీవ్రమైన ఆరోపణలు రావడంతో దీనిపై స్పందించిన తెలంగాణ డిప్యూటీ సీఎం, గనుల శాఖ మంత్రి భట్టి విక్రమార్క టెండర్లు రద్దు చేసిన విషయం తెలిసిందే. అలాగే నైని బొగ్గు గని టెండర్ల నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్(ఎస్‌సీసీఎల్) కూడా ప్రకటించింది. అయితే.. ఇంతకుముందు నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఈరోజు(గురువారం) సాయంత్రం 5:00 గంటల నుంచి బిడ్లు ప్రారంభం కావాల్సి ఉంది. పాలనాపరమైన కారణాలతో టెండర్లను రద్దు చేస్తున్నట్లు సింగరేణి అధికారులు ప్రకటించారు. ఇదిలావుంటే భారత రాష్ట్ర సమితి హయాంలో సింగరేణి బోర్డు నామమాత్రంగా ఉండేదని, వారి హయాంలోనే ఆ సంస్థ అప్పులు భారీగా పెరిగాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి విద్యుత్ వాడుకొని జెన్‌కో, ట్రాన్స్‌కో డబ్బులు ఇవ్వలేదు. టెండర్ల నుంచి కాంట్రాక్టుల వరకూ అన్నీ కేసీఆర్ కుటుంబమే చూసేది. ఆ సంస్థ సీఎస్ఆర్ నిధులు కూడా దుర్వినియోగం చేశారు. బీఆర్ఎస్ హయాంలో ప్రైవేటు కంపెనీలకు పనులు కట్టబెట్టారు. సింగరేణి బోర్డు సమావేశం వివరాలు కూడా నా దృష్టికి రావు. సింగరేణిపై కేంద్రం అజమాయిషీ ఎప్పుడూ లేదు. నిధులు లేక జిల్లాలకు రూ.1500 కోట్ల డిస్ట్రిక్ మినరల్ ఫండ్ ఇవ్వలేదు. బీఆర్ఎస్ హయాంలోనే ఆ సంస్థ అప్పులు భారీగా పెరిగాయి. గత పదేళ్లలో రూ.32వేల కోట్లకుపైగా సింగరేణి అప్పులు పెరిగాయి. సింగరేణి కార్మికులకు ప్రభుత్వం సుమారు రూ.47వేల కోట్లు చెల్లించాలి. నిబంధనలకు విరుద్ధంగా సీఎండీని మరో 4 ఏళ్లు అదనంగా కొనసాగించారు. ప్రస్తుతం సింగరేణిలో ఇన్‌ఛార్జి సీఎండీతో కాలం గడుపుతున్నారని కేంద్ర మంత్రి విమర్శించారు.

## మేడారం జాతరకు భారీ ఏర్పాట్లు

(మొదటిపేజీ తరువాయి)

వస్తారనే అంచనాతో తెలంగాణ ప్రభుత్వం రూ.100కోట్లకు పైగా నిధులతో ఏర్పాట్లు చేస్తోంది.గద్దెల ప్రాంగణంలో భక్తుల రద్దీని తట్టుకునేలా క్యూలైన్లను వెడల్పు చేశారు. జంపన్న వాగు వద్ద స్నాన ఘట్టాలను ఆధునీకరించారు. ఆర్టీసీ వేల సంఖ్యలో ప్రత్యేక బస్సులను నడుపుతోంది. అడవిలో తాత్కాలిక వైద్య శిబిరాలు, నిరంతర విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేక గ్రిడ్లను ఏర్పాటు చేశారు. లక్షలాది మంది భక్తులు వచ్చినా ఇబ్బంది కలగకుండా వేల మంది సిబ్బందితో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్నారు. ఈ జాతర తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల నుంచి కులమతాలకు అతీతంగా కోట్లాది మంది భక్తులను ఆకర్షిస్తూ.. సమ్మక్క-సారక్కల త్యాగాలను, గిరిజన సంస్కృతిని సజీవంగా నిలబెడుతోంది. కాకతీయుల కాలం నుంచి ఇప్పటి వరకు మేడారం జాతరకు వచ్చే భక్తుల సంఖ్య క్రమంగా పెరుగుతూనే ఉంది. గిరిజన ఆదివాసీ జాతర సమ్మక్క-సారలమ్మ వనదేవతల జాతరకు అన్నీ సిద్ధమవుతున్నాయి. జాతర సమయం సమీపిస్తున్నకొద్దీ అధికార యంత్రాంగం భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ముమ్మరం చేసింది. రెండేళ్లకోసారి నిర్వహించే జాతర వేడుకలు మాఘశుద్ధ పౌర్ణమికి ముందు నాలుగురోజులపాటు సమ్మక్క-సారలమ్మ జాతరను భక్తులు కోలాహలంగా జరుపుకుంటారు. పేరుకే గిరిజన జాతర అయినప్పటికీ అన్నివర్గాలకు చెందిన భక్తులు భక్తిశ్రద్ధలతో వనదేవతలకు పూజలు చేస్తారు.ఈనెల 28నుంచి సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా తల్లులను దర్శించి మొక్కులు చెల్లించడానికి భక్తజనం సిద్ధమవుతున్నారు. వనదేవతలకు బెల్లం కొనుగోలు చేసి భక్తులు పంచిపెడుతున్నారు. దీంతో బెల్లందుకాణాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. మార్కెట్లో 10కిలోల బెల్లంముద్దలు రూ.50 కిలో అయితే రూ.55వరకు అమ్మకాలు కొనసాగుతున్నాయి. దీంతో బెల్లం అమ్మకాలకు గిరాకీ పెరిగింది. దీనిని బంగారంగా భావించి అమ్మవార్లకు సమర్పిస్తారు.



## మేడారంలో హెలికాప్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి
### మంత్రి దనసరి అనసూయ సీతక్క

**ములుగు, జనవరి 22 :** మేడారంలోని సమ్మక్క సారలమ్మను దర్శనం చేసుకోవడానికి వచ్చే భక్తులు హెలికాప్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు దనసరి అనసూయ సీతక్క అన్నారు. గతంలో కాలినడక నుండి కార్ల మీద వచ్చిన భక్తులు నేడు ఎడ్ల బండ్లను వదిలి హెలికాప్టర్ పై రావడానికి సిద్ధమవుతున్నారని అన్నారు. గురువారం ములుగు జిల్లా కేంద్రానికి సమీపంలోని డిగ్రీ కళాశాల ఆవరణలో తంబి సంస్థవారు హెలికాప్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవడానికి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి దనసరి అనసూయ సీతక్క పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అమ్మవార్లను సత్వరమే దర్శనం చేసుకోవడానికి సమయం వృధా కాకుండా హెలికాప్టర్ సేవలను రాష్ట్ర పర్యాటక శాఖ చేపట్టిందని, హనుమకొండ జిల్లా కేంద్రం నుండి మేడారం వరకు తిరిగి మేడారం నుండి హనుమకొండ కు వెళ్లేందుకు అతి తక్కువ ధరలలో ఒక్కొక్కరికి 31 వేల రూపాయల టికెట్ నిర్ణయించిందని, అంతేకాకుండా మేడారం పరిసర ప్రాంతాల్లో హెలికాప్టర్ ద్వారా పర్యటించడానికి 4 వేల 8 వందల రూపాయల టికెట్ ను ఖరారు చేశారని వివరించారు. గతంలో మహా జాతర సందర్భంగా అప్పటి పాలకులు నామమాత్రంగా నిధులు కేటాయించగా నేడు రాష్ట్రంలోని ప్రజాప్రభుత్వం గద్దెల పునరుద్ధరణ పనులతో పాటు అభివృద్ధి కార్యక్రమాల కోసం 2 వందల 51 కోట్ల రూపాయలను కేటాయించడం జరిగిందని అన్నారు. నేటి నుండి ఈ నెల 31 వరకు వీరి సేవలు కొనసాగుతాయని తెలిపారు. గత 10 సంవత్సరాలుగా సేవలందిస్తున్న థంబి ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ సర్వీస్ నిర్వహిస్తుంది.

## 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ
# తెలంగాణ రైజింగ్ విజన్ లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

జార్జ్‌లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ విజన్ లక్ష్యాలతో పాటు వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ఫాలో అప్ సదస్సు నిర్వహించే ప్రతిపాదనలను చర్చించారు. ప్రతి ఏడాది జులైలో హైదరాబాద్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఫాలో-అప్ సమావేశం నిర్వహించాలని ప్రతిపాదించారు. జనవరిలో జరిగే దావోస్ లో జరిగే సదస్సులోని చర్చలు, తీసుకున్న నిర్ణయాల పురోగతిని సమీక్షించు కునేందుకు ఫాలో అప్ సమావేశం ఉపయోగ పడుతుందన్నారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం భాగస్వామ్యంతో ఫాలో అప్ సదస్సు నిర్వహిం చేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తెలంగాణలో అందుబాటులో ఉన్న అవకాశాలు, పారిశ్రామిక రంగంలో ఉన్న అనుకూలతలు, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సహకాలు, ప్రభుత్వ విధానాలను ప్రపంచానికి చూపించాలనే ఆలోచనను పంచుకున్నారు. అందుకే హైదరాబాద్‌లో ఫాలో అప్ ఫోరమ్ నిర్వహించాలలని కోరారు. ముఖ్యమంత్రి ప్రతిపాదనకు వరల్డ్ ఎకనమిక్ ఫోరం బృందం సానుకూలంగా స్పందించింది. వివిధ దేశాల నుంచి ప్రతిపాదనలు వచ్చినప్పటికీ.. సమీప భవిష్యత్తులో నిర్ణయం తీసుకుం టామని మేనేజింగ్ డైరెక్టర్ జెరెమీజ్గన్స్ తెలిపారు. చైనాలో ప్రతి ఏడాది 'సమ్మర్ దావోస్' జరుగుతోందని,సౌదీ అరేబియా కూడా ఆసక్తి ప్రదర్శిస్తోందని చెప్పారు. ఈ సమావేశంలో తెలంగాణ రైజింగ్ 2047 విజన్, 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే రోడ్‌మ్యాప్, లక్ష్యాలను సీఎం వివరించారు. తెలంగాణ విజన్‌లోని విభిన్న కోణాలు వివిధ కోణాలు పరస్పర సహకారానికి అవకాశం కల్పించేలా ఉన్నాయని ప్రశంసించారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో తాము భాగస్వామ్యం పంచుకుంటామన్నారు. తెలంగాణ ఆర్థిక వృద్ధి ప్రయాణంలో కలిసి వస్తామనే సంకేతాలు ఇచ్చారు. హైదరాబాద్లో ప్రతిభావంతమైన మానవ వనరులున్నాయని అభిప్రాయపడ్డారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. స్కిల్ డెవెలప్మెంట్, స్పోర్ట్స్కు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. హైదరాబాద్‌లో జరిగిన బయోఏషియా 2024లో ప్రారంభించిన తెలంగాణ సెంటర్ ఫర్ ది ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్ పురోగతిపై ఈ సమావేశంలో చర్చలు జరిగాయి. ఆరోగ్యం, లైఫ్ సైన్సెస్ రంగాలకు సంబంధించి వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ భారత్లో ప్రారంభించిన తొలి థీమాటిక్ సెంటర్ అదేనని గుర్తు చేశారు. ఆదర్శవంతమైన మోడల్గా గుర్తింపు సాధిం చిందన్నారు. పరిశ్రమల అభివృద్ధి ప్రణాళికలో ఉత్తమ పద్ధతులపై అ4ఎఖీ చేస్తున్న పరిశోధనల సమాచారాన్ని తెలంగాణ ప్రభుత్వంతో పంచుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మూడు జోన్ల నమూనాను విశ్లేషించారు. ఆర్థిక అభివృద్ధి వ్యూహంతో పాటు భారత్ ఫ్యూచర్ సిటీ ఏర్పాటును వివరించారు. ఇది నెట్-జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టుగా, దేశంలో సుస్థిర అభివృద్ధికి రోల్ మోడల్ సిటీగా నిలుస్తుందన్నారు. సమావేశంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, ఏరోస్పేస్, డిఫెన్స్, బయో-డిజైన్, సాఫ్ట్‌వేర్, ఫార్మా రంగాల్లో హైదరాబాద్కు ఉన్న అనుకూలతలను వివరించారు. ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధనంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు.

## ఫ్యూచర్ సిటీలో 100 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్

(మొదటిపేజీ తరువాయి)

నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' బృందం దావోస్‌లో యూపీసీ వోల్ట్ సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. యూపీసీ వోల్ట్ సీఈవో హాన్ డీ గ్రూట్, యూపీసీ రిన్యూవబుల్స్ ఏపీఏసీ సహ వ్యవస్థాపకుడు స్టీవెన్ జ్వాన్, యూపీసీ రిన్యూవబుల్స్ ఇండియా సీఈవో అలోక్ నిగమ్ తో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నెదర్లాండ్స్ కు చెందిన యూపీసీ రిన్యూవబుల్స్ గ్రూప్, వోల్ట్ డేటా సెంటర్స్ కలిసి యూపీసీ వోల్ట్ సంస్థగా ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఈ సంస్థ భారత్ ఫ్యూచర్ సిటీలో 100 మెగావాట్ల సామర్థ్యంతో ఏఐకు అనుకూలమైన డేటా సెంటర్ నెలకొల్పనుంది. ఈ ప్రాజెక్టుకు ఐదేళ్లలో రూ.5,000 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ డేటా సెంటర్‌కు అవసరమైన విద్యుత్ సరఫరాకు 100 మెగావాట్ల సామర్థ్యంతో ప్రత్యేక పునరుత్పాదక విద్యుత్ ఎ÷-లాంట్ ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణ దశలోనే 3వేల మందికి పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగావకాశాలు లభిస్తాయి. డేటా సెంటర్ ప్రారంభమైన తర్వాత మరో 800 మందికి ఉద్యోగ అవకాశాలుంటాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దడంలో ఆధునిక డిజిటల్ మౌలిక వసతులు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు అభివృద్ధిని సాధించడమే రాష్ట్ర లక్ష్యమని స్పష్టం చేశారు. ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. అధునాతన ఏఐ డేటా సెంటర్ల ఏర్పాటుకు అవసరమైన ప్రోత్సాహకాలు, సౌకర్యాలు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. నెట్ జీరో సిటీ అభివృద్దే తెలంగాణ విజన్ లో భాగమని అన్నారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## ధాన్యం దిగుబడితో పాటు..
# కొనుగోలులోనూ రికార్డు

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల వ్యవధిలో అనుసరించిన విధానాల ఫలితమే ధాన్యం దిగుబడి, కొనుగోలులోనూ సంచలనాత్మక రికార్డ్ నమోదు చేసుకుందని ఆయన చెప్పారు. పౌరసరఫరాల శాఖా,నీటిపారుదల, వ్యవసాయ శాఖలు పరస్పరం సమన్వయం చేసుకోవడంతో పాటు తెలంగాణా రైతాంగం భాగస్వామ్యంతోటే ఇంతటి విజయం సాధించామని ఆయన చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన 75 సంవత్సరాల చరిత్రలోనే రికార్డ్ స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసిన ఘనత తెలంగాణా రాష్ట్రానికి దక్కిందన్నారు. దేశ చరిత్రలోనే ఇంత పెద్ద స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసిన దాఖలాలు దేశంలోని మరే ఇతర రాష్ట్రాలలో లేవని ఆయన తెలిపారు. 2020-21 లో నమోదు అయిన 70.2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు రికార్డ్ ను అధిగమించి తాజాగా జరిగిన ఖరీఫ్ సీజన్ లో71.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసి దేశ చరిత్రలోనే కొత్త అధ్యాయం సృష్టించిందన్నారు. మద్దతు ధర తో పాటు సన్నాలకు మొట్టమొదటి సారిగా తెలంగాణా ప్రభుత్వం అందిస్తున్న బోనస్ తో కలిపి మొత్తం 18,532.98 కోట్ల రూపాయలను 14.20 లక్షల మంది రైతులకు చెల్లించామన్నారు. ఖరీఫ్ సీజన్ లో రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా రూపొందించిన మేరకు అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా 8,548 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంతో పాటు కొనుగోలు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంతో రైతులు ఎక్కడ ఇబ్బంది పడకుండా కొనుగోలు పక్రియ ముగిసిందని ఆయన వివరించారు. అందుకు పౌర సరఫరాల శాఖ సిబ్బంది పని తీరును మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. అధిక దిగుబడులతో పాటు రికార్డ్ స్థాయిలో కొనుగోలు చెసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి భారత ఆహార సంస్థతో పాటు ప్రజాపంపిణీ వ్యవస్థ కు సరఫరా చేయడంతో పాటు తెలంగాణా బియ్యానికి అంతర్జాతీయ మార్కెట్లో ఉన్న డిమాండ్ ను పట్టి విదేశాలకు ఎగుమతి చేసేందుకు విధి విధానాలను రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ ఉన్న ధాన్యాన్ని పండించేందుకు గాను రైతులను ప్రోత్సహించేందుకు ప్రోత్సాహకాల ఆవశ్యకతను ఆయన వివరించారు. అంతర్జాతీయ మార్కెట్ కు బియ్యాన్ని ఎగుమతి చెసేందుకు కుడా ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆయన తెలిపారు. ధాన్యం కొనుగోలు పక్రియలో రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి 38,000 కోట్లను నేరుగా రైతుల ఖాతాలో జమ చేయడం కుడా ఒక అరుదైన రికార్డే అని ఆయన చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రైతాంగం పట్ల అనుసరించిన విధానాలతో సంచలనాత్మక ఫలితాలు సాధించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థలోనూ విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు.అర్హులైన నిరుపేదలందరికీ సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన సన్నబియ్యం 3.17 కోట్ల మందికి ఉచితంగా పంపిణీ చేస్తున్నామని,అంటే రాష్ట్ర జనాభాలో 85? లబ్ధి పొందుతున్నారని ఆయన వివరించారు.అర్హులైన ప్రతి లబ్దిదారుకు నెలకు ఆరు కిలోల బియ్యం ఉచితంగా అందిస్తున్నామన్నారు. సన్నబియ్యం పంపిణీ మీద 13,650 కోట్లు ఖర్చు పెడుతున్నట్టు ఆయన తెలిపారు. నాణ్యతా లోపాలు గుర్తించడంతో పాటు అక్రమంగా బ్లాక్ మార్కెట్ కు తరలి పోయే విధానానికి కళ్లెం వేసి నాణ్యతా ప్రమాణాలపై కఠిన నిబంధనలు అమలులోకి తెచ్చామన్నారు. ధాన్యం కొనుగోళ్ల పక్రియ సీజన్ కు సీజన్ కు పెరుగుతున్న నేపద్యంలో అందుకు అనుగుణంగా నిల్వ చేసేందుకు మౌలిక సదుపాయాల ఆధునీకరణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ధాన్యాన్ని నిల్వచేసే గోదాముల సామర్థ్యం 29 లక్షల మెట్రిక్ టన్నుల వరకు పరిమితము అయ్యిందని,ఈ గోదాములను భారత ఆహార సంస్థ,రాష్ట్ర గోదాముల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహణ కొనసాగుతుందని అయితే నాణ్యతా లోపాలతో నిల్వ ఉంచిన బియ్యం చేడి పోయి రాష్ట్ర ప్రభుత్వానికి భారీ నష్టం వాటిల్లుతుందని ఆయన తెలిపారు. ప్రభుత్వం సహకారంతో పాటు ప్రవైట్ సంస్థల భాగస్వామ్యం తో ధాన్యం నిలువ ఉంచే గోదాములను సైలో పద్దతిలో ఆధునికరించేందుకు ప్రభుత్వం యోచిస్తోందన్నారు.. ఆధునికీకరణతో తేమ శాతం నియంత్రణలో ఉండడంతో పాటు నష్టానివారణ చర్యలు చేపట్టవచ్చన్నారు. అయితే ప్రారంభంలో ఆధునీకరణకు ఖర్చు ఎక్కువే అయినప్పటికీ నిల్వ చేసిన బియ్యం చెడిపోకుండా ఉంటే అది ప్రయోజనం కలిగిస్తుందన్నారు. బీహార్ వంటి రాష్ట్రాల నుండి వలస వచ్చే కార్మికులపై తెలంగాణా రాష్ట్రంలో రైస్ మిల్లులు ఆధారపడుతున్నాయని,ఇటీవల ఆ రాష్ట్రంలో ఎన్నికలు జరిగితే వలస వచ్చిన కార్మికులు వారి వారి స్వస్థలాలకు వెళ్లిపోవడంతో కొనుగోళ్ల పక్రియకు ఆటంకాలు ఏర్పడ్డాయని ఆయన చెప్పారు. అటువంటి పరిస్థితి తిరిగి ఉత్పన్నం కాకుండా ఉండేందుకు గాను స్థిరమైన కార్మిక వ్యవస్థ ఏర్పాటు ఆవశ్యకతను ఆయన సూచించారు. అదే విదంగా మిల్లింగ్ రంగం గురుంచి ఆయన ప్రస్తావిస్తూ ప్రభుత్వం రూపొందించిన నిబంధనలు పాటించిన మిల్లర్లకు సంపూర్ణ సహాయ సహకారాలు ఉంటాయని తప్పిదాలకు పాల్పడితే మాత్రం చర్యలు కఠినాత్మకంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు. రాజకీయ వత్తిళ్లకు లొంగకుండా నిబంధనల అమలులో సిబ్బంది కఠినంగా ఉండాలని ఆయన ఉద్బోధించారు. అదే సమయంలో డిఫాల్ట్ అయిన మిల్లులకు ధాన్యం కేటాయింపు ప్రసక్తే లేదని ,పౌర సరఫరాల శాఖ రూపొందించిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాల్సిందేనున్నారు. పెరుగుతున్న ధాన్యం ఉత్పత్తి కనుగుణంగా ఎగుమతులను లక్ష్యంగా పెట్టుకుని రాష్ట్రంలో మిల్లుల పరిశ్రమని ప్రోత్సహించె విదంగా విధివిదానలను త్వరలో ప్రకటించ నున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా మరిన్ని నిత్యావసర సరుకుల సరఫరాకు ప్రభుత్వం ఆలోచన చేస్తుందని ఆయన చెప్పారు.

# కేటీఆర్‌కు సిట్ నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)

తెలిసిందే. ఈ కేసులో ప్రమేయం ఉన్న పోలీస్ ఉన్నతాధికారుల్లో కొందరు ఇప్పటికే అరెస్ట్ అవగా.. ఇప్పుడు నాయకుల విచారణ జరుగుతోంది. ఈ కేసులో ఇటీవలే మాజీ మంత్రి హరీశ్ రావుకు నోటీసులు జారీ చేసిన సిట్ అధికారులు.. ఆయన్ను కూడా ఇటీవల విచారించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయన్ను పలు అంశాలపై విచారించిన అధికారులు.. కీలక సమాచారం రాబట్టినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సిట్ అధికారులు కేటీఆర్‌కు నోటీసులు జారీ చేయడం హాట్ టాపిక్‌గా మారింది.ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్‌కు నోటీసులు జారీ చేయడంపై హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. 'నిన్న నాకు నోటీసులు ఇచ్చారు. ఇప్పుడు కేటీఆర్‌కు ఇచ్చారు. బొగ్గు స్కామ్‌పై సమాధానం చెప్పే దమ్ములేదు. రేవంత్ రెడ్డి ఎన్ని నోటీసులు ఇచ్చినా.. 6 గ్యారంటీలు, 420 హామీలు అమలు చేసేదాకా వదలబోము. ఎన్ని నోటీసులు ఇచ్చినా.. ఎన్ని అటెన్షన్ డైవర్షన్లు చేసినా.. రేవంత్‌ను వదిలిపెట్టే ప్రసక్తే లేదు. ఆయన వెంటపడుతూనే ఉంటాం' అని హరీశ్ రావు స్పష్టం చేశారు.



## ఇందిరమ్మ ఇళ్లు కట్టుకోండి

(మొదటిపేజీ తరువాయి)

మండలంలోని జంగాం గ్రామంలో భట్టి విక్రమార్క పర్యటించారు. స్వయం సహాయక మహిళ సంఘాలకు రూ.3.41 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కులతో పాటు ఇందిరమ్మ ఇళ్ల కు సంబంధించిన పత్రాలు అందజేశారు. ఈ సంద్భంగా భట్టి మాట్లాడుతూ.. నీటి పారుదల సమస్యలు అడిగారు. అప్పుడు బ్రిడ్జి అడిగారు. వాటి పనులు పూర్తి చేసే పనిలో ఉన్నామన్నారు. ఓజా కళాకారుల కళ ఎంతో గొప్పది అని కొనియాడారు. కళాకారులను ఆదుకుంటాం అని అండగా ఉంటామని చెప్పాను. అందులో భాగంగా మీ ఓజా కళను కాడుకోవడం కోసం రుణాలు ఇచ్చే నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇందిరమ్మ చీరలు కట్టుకొని మహాలక్ష్మి ల్లాగా ఉన్నారు.. మహిళలకు ఇప్పటికే రూ.26 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామని వెల్లడించారు. మహిళల్ని కోటీశ్వరులను చేయడమే మా ప్రభుత్వం లక్ష్యమని స్పష్టం చేశారు. మీరు ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తే మేము డబ్బులు కడుతున్నామని తెలిపారు. నాడు వెయ్యి రూపాయలు లేని పరిస్థితిలో ఉన్న మహిళను నేడు బస్సులకు ఓనర్లను చేశాం.. చెప్పినట్టుగానే ధరణి తీసి భూ భారతి తెచ్చామని భట్టి తెలిపారు. కొమరం భీం ప్రాజెక్ట్ కెనాల్ కాలేదు అన్నారు.. వారికి ప్రపోజల్స్ పంపారు.. పనులు త్వరలో ప్రారంభం చేస్తామని హామీ ఇచ్చారు. దొడ్డు బియ్యం స్థానంలో సన్న బియ్యం ఇస్తున్నాం.. 96 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు ఇచ్చాం. విద్యుత్ శాఖ అధికారులు పొలం బాట, ప్రజా బాట పట్టారు. మీ సమస్యలు పరిష్కారం చేస్తారు. వారిని కలవండని గ్రామస్తులకు సూచించారు. 108 తరహాలో విద్యుత్ సమస్యల పైన 1912 ను సంప్రదించండి విద్యుత్ సమస్యలను పరిష్కారం చేస్తారని అన్నారు. మీ ప్రాంత సమస్య లను పరిష్కారం కోసం ఓ అంబులెన్స్ వస్తుందని ఉపముఖ్యమంత్రి భట్టి తెలిపారు.

## తెలుగు సినిమాలకు గద్దర్ అవార్డులు

(మొదటిపేజీ తరువాయి)

తెలిపింది. ఫీచర్ ఫిలిమ్స్, జాతీయ సమైక్యతపై ఫీచర్ ఫిలిమ్స్, పర్యావరణం, హెరిటేజ్, చరిత్ర, సామాజిక చైతన్యం, బాలల చిత్రాలు, చలన చిత్ర రంగంలో టెక్నీషియన్లు, డాక్యుమెంటరీ, షార్ట్ ఫిలిమ్స్,సినిమా రంగంపై బుక్స్ తదితర రంగాలలో ఈ అవార్డులు ప్రదానం చేయనున్నట్టు తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వెల్లడించారు. ఇప్పటివరకు ఉన్న అవార్డు విభాగాలకు తోడు ఈసారి కొత్త విభాగాలను కూడా ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. సామాజిక స్పృహను ప్రతిబింబించే చిత్రాలకు 'ఉత్తమ సామాజిక సందేశ చిత్రం' అవార్డు, ప్రత్యేక విభాగంలో సి. నారాయణరెడ్డి అవార్డులను అందజేయనున్నామన్నారు. ఈ గద్దర్ అవార్డులకు అర్హులైన నిర్మాతలు, ఇతర దరఖాస్తుదారులు అవార్డులకు సంబంధించిన దరఖాస్తు పత్రాలు, మార్గదర్శకాలను జనవరి 31, 2026 వరకు పొందవచ్చని, తగిన డాక్యుమెంట్లతో కూడిన ఎంట్రీల సమర్పణకు ఫిబ్రవరి 3 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు.ఈ అవార్డుల వివరాలు వెబ్‌సైట్ లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. నిర్దేశిత మార్గదర్శకాలను పాటిస్తూ నిర్ణీత గడువులోపే దరఖాస్తులను సమర్పించాలని అర్హులైన నిర్మాతలను కోరారు.

# మేడారం జాతరకు రోడ్ల నిర్మాణం

- రూ.165 కోట్లతో రహదారుల పటిష్టత
- 418 ఎకరాల విస్తీర్ణంలో పార్కింగ్ సదుపాయం

**ములుగు, జనవరి 22 :** ప్రతి రెండేళ్లకు ఒకసారి జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ గిరిజన జాతర ప్రారంభానికి మరో ఐదు రోజులు మాత్రమే ఉండడంతో ఇప్పటికే మేడారానికి ప్రతీ రోజూ లక్షలాది మంది భక్తులు ముందస్తు మొక్కులకై తరలి వస్తున్నారు. కేవలం, జాతర జరిగే జనవరి 28 వతేదీ నుండి 31 తేదీ మధ్యలోనే దాదాపు కోటిన్నరకు పైగా భక్తులు హాజరవుతారని అంచనా వేసినందున, మేడారానికి వచ్చే ప్రధాన రహదారులు, జాతీయ రహదారులు, రోడ్లు, భవనాల శాఖ నిర్వహణలో ఉండే రహదారులతో పాటు పంచాయితీ రాజ్ శాఖ ద్వారా నిర్వహించే రహదారులన్నింటిని పూర్తిస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేసింది. వివిధ శాఖల క్రింద మేడారానికి దారితీసే 39 ప్రధాన రహదారులు ఉన్నాయి. ఇవే కాకుండా, మరో 10 రోడ్లను, మూడు కల్వర్టులను కొత్తగా నిర్మించారు. జాతీయ రహదారులకు చెందిన 8 రహదారుల పటిష్టత, మరమ్మతు, నూతన బ్రిడ్జిల నిర్మాణాన్ని రూ. 360 లక్షలతో చేపట్టి పూర్తి చేశారు. వీటిలో, ప్రధానంగా, కటాక్షపూర్, మల్లంపల్లి లవద్ద నూతన బ్రిడ్జిల నిర్మాణం పూర్తి చేశారు. రోడ్లు, భవనాల శాఖ ద్వారా దాదాపు రూ. 102 కోట్ల వ్యయంతో రహదారుల నిర్మాణం, పటిష్ట, ఇతర సివిల్ పనులు రికార్డు సమయంలో పూర్తిచేశారు. ఈ శాఖ క్రింద ఉన్న పస్రా నుండి భూపాల పల్లి వరకు 33 కిలోమీటర్లు, తాడ్వాయి నుండి నార్లాపూర్ వరకు 20 కిలోమీటర్లు, చిన్నబోయినపల్లి నుండి ఊరట్టం వరకు 23 కి.మీ. రహదారుల పటిష్టత, రీకార్పెటింగ్ చేపట్టారు. వీటితోపాటు, చిలకల గట్టు సమ్మక్క మార్గం నుండి గద్దెల వరకు, సమ్మక్క టెంపుల్ వద్ద, పోలీస్ క్యాంపు ల వద్ద బారికేడింగ్ ఏర్పాట్లు చేశారు. పోలీస్ క్యాంపు వద్ద హెలీపాడ్స్ నిర్మాణం, మరమత్తులు చేపట్టడం జరిగింది. పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా



రూ. 52 .21 కోట్ల వ్యయంతో 84 పనులు చేపట్టడం జరిగింది. ఇదేకాకుండా, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా రూ. 8.08 కోట్ల వ్యయంతో 3 కొత్త భవనాల నిర్మాణం, 29 ప్రస్తుత భవనాల మరమత్తులు, 5 కొత్త రోడ్ల నిర్మాణం తదితర పనులను చేపట్టి పూర్తి చేశారు. మేడారం జాతరకు ఆర్టీసీ బస్సులతో పాటు భారీ సంఖ్యలో ప్రయివేటు వాహనాలలో భక్తులు వస్తారు. లక్షల సంఖ్యలో వచ్చే ఈ వాహనాల పార్కింగ్ కు ప్రభుత్వం పెద్దఎత్తున ఏర్పాట్లు చేసింది. ప్రధానంగా. 43 ప్రాంతాల్లో 1418 ఎకరాల విస్తీర్ణంలో పార్కింగ్ సదుపాయాలను కల్పించారు. వీటిలో, అటవీ శాఖకు చెందిన 15 ప్రాంతాలలో 235 ఎకరాల్లో, ట్రైబల్ వెల్ఫేర్, పట్టా భూములకు చెందిన 24 ప్రాంతాల్లో 1164 ఎకరాల్లో, ప్రభుత్వ భూములకు చెందిన 3 ప్రాంతాల్లో 19 ఎకరాల్లో పార్కింగ్ సదుపాయంతో పాటు ఇక్కడ ఉండే భక్తులు, డ్రైవర్లకు తాగునీటి సౌకర్యం, టాయిలెట్ తదితర సౌకర్యాలను కల్పించారు.



## ఏఐ ఇన్నోవేషన్ హబ్‌కు అపూర్వ స్పందన

- ఏఐ అకాడమీకి పియర్సన్ సహకారం
- యువతకు ఏఐ శిక్షణ అందించాలన్న సిఎం రేవంత్

**దావోస్, జనవరి 22 :** దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమావేశాల్లో తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్ కు అంతర్జాతీయ స్థాయిలో అపూర్వ స్పందన లభించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' బృందం పలు ప్రతిష్ఠాత్మక సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. బ్రిటన్‌కు చెందిన ప్రముఖ విద్యా, పబ్లిషింగ్ సంస్థ పియర్సన్ తెలంగాణ ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా తెలంగాణలో ఏర్పాటు కానున్న గ్లోబల్ ఏ ఐ అకాడమీకి పియర్సన్ సహకారం అందించనుంది. ఏ ఐ శిక్షణ, పాఠ్య ప్రణాళిక, లెర్నింగ్ కంటెంట్, అంచనా విధానాలు, అంతర్జాతీయ స్థాయి సర్టిఫికేషన్లలో తన నైపుణ్యాన్ని పియర్సన్ ఉపయోగించనుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ యువతకు ఏ ఐ శిక్షణ అందించి భవిష్యత్ తరాలకు నైపుణ్యం కలిగిన రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. ఎంఓయూ కుదుర్చుకున్న బృందాన్ని ఆయన అభినందించారు. ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, హైదరాబాద్‌లో ఏ ఐ సిటీ నిర్మాణానికి అవసరమైన పూర్తి స్థాయి ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. తెలంగాణలో ఇప్పటికే అన్ని ప్రముఖ టెక్ కంపెనీలు ఉన్నాయని, ప్రతిభ, మౌలిక సదుపాయాలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (ఐటీ, పరిశ్రమలు) సంజయ్ కుమార్ మాట్లాడుతూ, పియర్సన్‌తో కలిసి ఉన్నత నైపుణ్యాల కలిగిన మానవ వనరుల అభివృద్ధి దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ప్రాజెక్టు త్వరితగతిన అమలుకు అవసరమైన అనుమతులు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. జార్జ్‌టౌన్ యూనివర్సిటీకి చెందిన ఏ ఐ కోల్యాబ్ సంస్థతో కూడా తెలంగాణ ప్రభుత్వం ఎంఓయూ కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా ఆరోగ్య రంగంలో ఏ ఐ ఆధారిత పరిశోధనలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆరోగ్య సంరక్షణ, ప్రజారోగ్యం, లైఫ్ సైన్సెస్ రంగాల్లో అనువర్తిత పరిశోధనలకు ఇది దోహదపడనుంది. అలాగే దుబాయ్ మల్టీ కమోడిటీస్ సెంటర్ తో కుదిరిన ఎంఓయూ ద్వారా స్టార్టప్‌ల అభివృద్ధికి అవకాశాలు అన్వేషించనున్నారు. రెండు దేశాల మార్కెట్లు, ఎకోసిస్టమ్‌లపై అవగాహన కల్పించడంతో పాటు, అంతర్జాతీయ సదస్సులు, కార్యక్రమాలు నిర్వహించే అంశాన్ని కూడా పరిశీలించ నున్నారు.



## సోషల్ మీడియాను పిల్లలకు దూరం చేసే యోచన

- ఆస్ట్రేలియా తరహాలో కట్టడికి యత్నం
- సిఎం రేవంత్‌తో ప్రత్యేకంగా నారా లోకేశ్ భేటీ

**దావోస్, జనవరి 22 :** ఆస్ట్రేలియాలో 16 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియాను వినియోగించడం పై అక్కడి ప్రభుత్వం డిసెంబరు నుంచి నిషేధం విధించిందని, ఇలాంటి సంస్కరణలు ఆంధ్రప్రదేశ్‌లోనూ అమలు చేసేందుకు పరిశీలిస్తున్నామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. పెట్టుబడులే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ బృందం దావోస్‌లో పర్యటిస్తోన్న సంగతి తెలిసిందే. దావోస్‌లో బ్లూమ్‌బర్గ్ తో లోకేశ్ ప్రత్యేకంగా మాట్లాడారు. ఒక నిర్దిష్ట వయస్సు కంటే తక్కువ ఉన్న యువకులు అలాంటి ప్లాట్‌ఫామ్‌లలో ఉండకూడదు. ఎందుకంటే వారు బహిర్గతం చేసే కంటెంట్‌ను పూర్తిగా అర్థం చేసుకోలేరు. అందువల్ల, బలమైన, చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్ అవసరం కావచ్చు. ఆ దిశగా మేం ఆలోచిస్తున్నాం' అని లోకేశ్ వెల్లడించారు. దావోస్ పర్యటనలోనే ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో నారా లోకేశ్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు పెట్టారు. రెండు రాష్ట్రాల్లోని విద్యా సంస్కరణలు, ఐటీ అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధిపై నిర్మాణాత్మక చర్చలు జరిపాం. పరస్పర సహాయ సహకారాలతో దేశంలోనే రెండు తెలుగు రాష్ట్రాలు అత్యంత వేగంగా వృద్ధి చెందుతాయని విశ్వసిస్తున్నా. వేర్వేరు రాష్ట్రాలుగా పెట్టుబడుల కోసం పోటీ పడినా.. కలిసి కట్టుగా దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపేందుకు ప్రయత్నిస్తున్నాం అని లోకేశ్ తెలిపారు.

## న్యూ ఇయర్ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

### పట్టుబడ్డ 270మందికి జైలు శిక్ష

**హైదరాబాద్, జనవరి 22 :** 2026 న్యూ ఇయర్ సందర్భంగా డ్రంక్ అండ్ డ్రైవర్‌లో పట్టుబడిన వారిలో 270 మందికి జైలు శిక్ష విధించారు. 2025 డిసెంబర్ 24 నుంచి 31 వరకు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన వందలాది మంది పట్టుబడ్డారు. ఈ కేసుల్లో విచారణ చేపట్టిన నగరంలోని పలు న్యాయస్థానాలు మొత్తం 270 మందికి జైలు శిక్ష విధిస్తూ తీర్పులు వెలువరించాయి. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టుల్లో పట్టుబడిన నిందితుల వివరాలను వారి కార్యాలయాలు, కళాశాలలకు పంపిస్తున్నట్లు ట్రాఫిక్ అధికారులు తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాలకు సిఫారసులు చేస్తున్నట్లు వెల్లడించారు. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా రహదారి భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే తమతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడుతుందని హెచ్చరించారు. భవిష్యత్తులో కూడా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించి రహదారి భద్రతకు సహకరించాలని పోలీసులు కోరారు.

## గ్రూప్-1పై తీర్పు వాయిదా




**హైదరాబాద్, జనవరి 22 :** గ్రూప్-1 పై గురువారం తెలంగాణ హైకోర్టు తీర్పు వెల్లడించాల్సి ఉండగా వాయిదా పడింది. తీర్పు ఇంకా రెడీ కాలేదని హైకోర్టు డివిజన్ బెంచ్ వెల్లడించింది. గ్రూప్-1 పై వెలువరించాల్సిన తీర్పును వచ్చేనెల 5కు వాయిదా వేసింది. హైకోర్టు తీర్పుతో 563 మంది గ్రూప్-1 అధికారుల భవితవ్యం తేలనున్నది. టీజీపీఎస్సీ 2024 లో గ్రూప్ 1 పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. పరీక్షలో అవకతవకలు జరిగాయని హైకోర్టును ఆశ్రయించారు సెలెక్ట్ కాని అభ్యర్థులు. విచారణ అనంతరం సెలెక్షన్ లిస్టును రద్దు చేసి మళ్లీ పరీక్ష నిర్వహించాలని హైకోర్టు సింగిల్ బెంచ్ తీర్పు ఇచ్చింది. సింగిల్ బెంచ్ తీర్పుపై స్టే విధించింది హైకోర్టు డివిజన్ బెంచ్. గత నెల 30 న పూర్తి వాదనలు విన్న హైకోర్టు డివిజన్ బెంచ్.. ఇవాళ నిర్ణయం వెల్లడించాల్సి ఉండగా వాయిదా పడింది.

## నేడు కేరళ పర్యటనకు ప్రధాని మోడీ

### ఎన్డీయే కూటమిలో చేరిన ట్వంటీ20 పార్టీ

**తిరువనంతపురం, జనవరి 22 :** ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సిన కేరళలో బీజేపీకి మరింత బలం చేకూరే కీలక పరిణామం చోటుచేసుకుంది. ట్వంటీ20 పార్టీ లాంఛనంగా ఎన్డీయే కూటమిలో గురువారంనాడు చేరింది. బీజేపీ కేరళ చీఫ్ రాజీవ్ చంద్రశేఖర్‌ను ట్వంటీ20 చీఫ్ సాబూ ఎం జాకబ్ కలుసుకుని ఎన్డీయేకు తమ పార్టీ మద్దతును ప్రకటించారు. శుక్రవారం ప్రధాని కేరళ పర్యటనకు వస్తున్న సందర్భంగా ఈ పరిణామం చోటు చేసుకోవడం గమనార్హం. జాబూ ట్వంటీ20 పార్టీతో పొత్తును చంద్రశేఖర్ స్వాగతించారు. ఎన్డీయే విజన్‌కూ, సాబూ విజన్‌కు చాలా దగ్గర సామీప్యం ఉందని, సాబూ చేరికతో అభివృద్ధి చెందిన కేరళ నిర్మాణం దిశగా చేస్తున్న తమ ప్రయత్నాలకు మరింత బలం చేకూరుతుందని అన్నారు. అభివృద్ధి, ప్రగతి, నిజమైన ప్రజాసేవకు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ/ఎన్డీయే కట్టుబడి ఉన్నాయని, తమ అభివృద్ధి సిద్ధాంతాలను విశ్వసించే ప్రతి ఒక్కరూ తమకు సహజ భాగస్వాములేనని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో చంద్రశేఖర్ పేర్కొన్నారు. విజయవంతమైన పారిశ్రామికవేత్తగా, ఉపాధి సృష్టికర్తగా, రాజకీయ నేతగా సాబూను తాను ఎంతగానో అభిమానిస్తానని చెప్పారు. 'వికసిత కేరళం' విజన్ ఇప్పుడు కేరళ అంతటా ప్రతిధ్వనిస్తోందనడానికి ఎన్డీయేలో సాబూ చేరికే నిదర్శనమని అన్నారు. కాగా, రాష్ట్రంలో ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరువనంతపురం మేయర్ పోస్టును బీజేపీ సొంతం చేసుకోవడం ఆ పార్టీ వర్గాల్లో ఉత్సాహాన్ని నింపింది. షెడ్యూల్ ప్రకారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 23వ తేదీ శుక్రవారంనాడు కేరళలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా తిరువనంతపురంలో పలు కొత్త ప్రాజెక్టుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేస్తారు. బహిరంగ సభలోనూ పాల్గొంటారు.




## గోద్రేజ్ ఛైర్మన్‌తో తెలంగాణ మంత్రుల భేటీ

- ఫ్యూచర్ సిటీలో హౌసింగ్ ప్రాజెక్టులపై చర్చ
- హైదరాబాద్ సందర్శించాలని కోరిన శ్రీధర్ బాబు

**దావోస్, జనవరి 22 :** ప్రపంచ ఆర్థిక వేదిక దావోస్‌లో తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డితో కలిసి గోద్రేజ్ ఇండస్ట్రీస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ నాదిర్ గోద్రేజ్‌తో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆయిల్ ఫామ్ వ్యవసాయంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగం, హైదరాబాద్‌లో ఉన్న గోద్రేజ్ క్రీమ్‌లైన్ డెయిరీ ప్లాంట్‌ను రూ.150 కోట్ల పెట్టుబడితో విస్తరించే అవకాశాలపై చర్చించారు. భారత్ ఫ్యూచర్ సిటీ నివాస ప్రాంతంలో భారీ గృహ నిర్మాణాల ప్రాజెక్టులు చేపట్టే అంశంపై మాట్లాడారు. ఫ్యూచర్ సిటీలో మౌళిక వసతులు ముఖ్యంగా స్కూళ్లు, ఆసుపత్రులు, కమ్యూనిటీ సౌకర్యాలు ఏర్పాటు చేయడం ప్రభుత్వానికీ, సంస్థకూ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలంగాణ ప్రతినిధులు పేర్కొన్నారు. నాదిర్ గోద్రేజ్‌ను హైదరాబాద్‌కు రావాలని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు.

## స్వల్పంగా దిగివచ్చిన బంగారం ధరలు



**న్యూఢిల్లీ, జనవరి 22:** బంగారం.. వెండి ధరలు స్వల్పంగా దిగొచ్చాయి. గత కొద్దిరోజులగా ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్నాయి. గోల్డ్, సిల్వర్ పోటాపోటీగా రాకెట్‌లా దూసుకుపోయాయి. సరికొత్త రికార్డులు సృష్టిస్తూ కొనుగోలుదారులను బెంబేలెత్తించాయి. అలాంటిది బుధవారం అగ్ర రాజ్యాధినేతల నుంచి వచ్చిన సానుకూల ప్రకటనలు పసిడి పరుగులకు బ్రేక్‌లు పడేలా చేశాయి. భారతదేశంతో వ్యూహాత్మక, ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింత పెంచుకుంటున్నట్లు యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా లేయెన్ ప్రకటించారు. అలాగే అతి త్వరలో భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం పూర్తవుతుందని ట్రంప్ ప్రకటించారు. ఈ ఇద్దరి నేతల ప్రకటనతో బంగారం, వెండి ధరలు దిగొచ్చినట్లుగా కనబడుతోంది. ఈరోజు తులం గోల్డ్‌పై రూ.2,290 తగ్గగా.. కిలో వెండిపై రూ.5,000 తగ్గింది. ఇది కూడా చదవండి: ఉసబీపూ: 'బోర్డ్ ఆఫ్ పీస్'పై అగ్ర రాజ్యాలు ఘర్షణ.. కారణమిదేనా..!? తులం గోల్డ్‌పై రూ.2,290 తగ్గడంతో బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,54,310 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల ధరపై రూ.2,100 తగ్గడంతో రూ.1,41,450 దగ్గర అమ్ముడవుతోంది. ఇక 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.1,720 తగ్గడంతో రూ.1,15,730 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక సిల్వర్‌కు బ్రేకులు పడ్డాయి. ఈరోజు కిలో వెండిపై రూ.5,000 తగ్గింది. దీంతో బులియన్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.3,25, 000 దగ్గర అమ్ముడవుతోంది. హైదరాబాద్, చెన్నైలో మాత్రం కిలో వెండి ధర రూ.3,40,000 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక ఢిల్లీ, ముంబై, కోల్‌కతాలో మాత్రం కిలో వెండి ధర రూ.3,25, 000 దగ్గర అమ్ముడవుతోంది.

## నంద్యాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- లారీని ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు
- బస్సు, లారీ డ్రైవర్ సహా క్లీనర్ మృతి



**నంద్యాల,జనవరి 22 :** జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. నెల్లూరు నుంచి హైద్రాబాద్ వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు టైర్ పంక్చర్ అయి అదుపుతప్పి రోడ్డు డివైడర్ దాటి అవతలివైపు వస్తున్న లారీని ఢీకొట్టింది. సిరువెళ్ల మెట్ట పై ట్రావెల్స్ బస్సు, లారీ దగ్ధం అయ్యాయి. బస్సు, లారీ మంటల్లో చిక్కుకుని పూర్తిగా కాలిపోయాయి. బస్సు డ్రైవర్, లారీ డ్రైవర్ మంటల్లో మృతి చెందగా బస్సు ఢీకొని లారీ క్లీనర్ మృతి చెందాడు. పలువురికి గాయాలు అయ్యాయి. మంటలు చెలరేగిన వెంటనే అటుగా వెళ్తున్న వాహనదారులు అద్దాలు పగలగొట్టడంతో బయటికి వచ్చారు బస్సులోని ప్రయాణీకులు. పోలీసులకు సమాచారం అందించడంతో వెంటనే ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. ఫైర్ ఇంజిన్ల సాయంతో మంటలను ఆర్పివేశారు. సిరవెళ్ల బస్, లారీ దగ్ధం ఘటనలో శ్రీవాణి ఆటో మొబైల్స్ కంటైనర్ లారీలో బైక్ లు రవాణా చేస్తూ దగ్ధం అయ్యింది. ప్రమాద సమయంలో బస్సులో 36 మంది ప్రయాణీకులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మొత్తం ప్రయాణీకులు క్షేమంగా ఉన్నట్లు తెలిపారు. బస్సు డ్రైవర్ ఓబులేసు అలియాస్ భాస్కర్, (50) సజీవ దహనం అయ్యారు. కడప నివాసిగా గుర్తించారు. మృతిచెందిన లారీ డ్రైవర్, క్లీనర్ లను ఇంకా గుర్తించలేదు. నంద్యాల జిజిహెచ్ లో చికిత్స పొందుతున్న ఆరుగురు సిరువెళ్ల బస్సు దగ్ధం బాధితులు.. ఇద్దరికి తీవ్రగాయాలు, నలుగురికి స్వల్ప గాయాలు అయ్యాయి. నంద్యాల ఆసుపత్రిలో బాధితులను పరామర్శించిన ఎస్పీ సునీల్ షెరాన్.. బాధితుల నుంచి ప్రమాదంపై వివరాలు తెలుసుకున్నారు. బస్సు దగ్ధం ఘటనలో గాయపడిన వారు హైద్రాబాద్ వాసులున్నారు.. చికిత్స పొందుతున్న శ్రీనివాసరెడ్డి, హరీష్, సునీత, గాయపడిన మరో ముగ్గురిని పోలీసులు హైద్రాబాద్ కు పంపించారు. సిరువెళ్ల బస్సు దగ్ధమైన ఘటన లో ప్రయాణీకుల ప్రాణాలు కాపాడటంలో కీలకంగా వ్యవహరించిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు క్లీనర్. క్లీనర్ అప్రమత్తం కాకుంటే ప్రయాణీకుల ప్రాణాలు గాల్లో కలిసేవని తెలిపారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు క్లీనర్ కు ప్రయాణీకులు కృతజ్ఞతలు తెలిపారు. క్లీనర్ ను అభినందించిన పోలీసులు. ప్రయాణీకులను కాపాడిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు క్లీనర్ సురేంద్ర సకాలంలో స్పందించడంతో ముప్పు తప్పింది.

## బ్యాంకుల్లో ఐదురోజుల పని విధానానికి డిమాండ్

### 27న బ్యాంక్ ఉద్యోగ సంఘాల సమ్మె

**హైదరాబాద్, జనవరి 22 :** దేశవ్యాప్తంగా ఈనెల 27న సమ్మె నిర్వహిస్తామని బ్యాంకు ఉద్యోగ సంఘాలుహెచ్చరించాయి. 5 రోజుల పని దినాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ సమ్మె చేస్తున్నట్లు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్(యూఎఫ్‌బీయూ) ప్రకటించాయి. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫోరం కన్వీనర్ ఆంజనేయ ప్రసాద్ మాట్లాడారు. రిజర్వ్ బ్యాంక్ ఇండియా, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఎల్ఐసీ), జనరల్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్(జిఐసి) వంటి సంస్థలలో కొనసాగుతున్న విధంగా తమకు 5 రోజులను అమలు చేయాలని గత 15 ఏళ్లుగా పోరాడుతున్నట్లు చెప్పారు. ఇందుకుగాను ప్రతి రోజు 42 నిమిషాలు అధికంగా పనిచేస్తామని చెప్పినప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని వారు అసహనం వ్యక్తం చేశారు. బ్యాంకింగ్ సెక్టార్(ఃజీనీతినిణ ఃూ।ఇఃబినీస)లో పనిచేస్తున్న వారు సామాజిక జీవితానికి దూరం అవుతున్నందున ఈ విధానాన్ని అమలు చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు. ఐదు రోజుల పని దినాలను తప్పనిసరిగా అమలు చేయాలని గత ఏడాది మార్చి 24, 25 తేదీలలో రెండు రోజుల సమ్మెకు పిలుపునివ్వడంతో అమలు చేస్తామని హామీ ఇచ్చి మరిచారని ఆంజనేయ ప్రసాద్ గుర్తు చేశారు. 9 నెలలుగా ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడంతో తప్పనిసరి పరిస్థితులలో సమ్మెకు వెళ్లాల్సి వస్తుందని చెప్పారు. ఖాతాదారులు సైతం తమ న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించుకునేందుకు జరుగుతున్న సమ్మెకు మద్దతు పలకాలని ఆంజనేయ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. 2024 మార్చిలో వేతన సవరణ సెటిల్‌మెంట్ సమయంలో మిగతా రెండు శనివారాలు కూడా సెలవు ఇచ్చేందుకు ఇండియన్ బ్యాంక్ అసోసియేషన్ (ఐబీఏ), యూఎఫ్‌బీయూ మధ్య అంగీకారం కుదిరింది. తాజాగా ప్రకటించిన ఈ సమ్మె కార్యరూపం దాలిస్తే.. ప్రభుత్వ రంగ బ్యాంకుల కార్యకలాపాలపై వరుసగా మూడు రోజుల పాటు ప్రభావం పడనుంది. జనవరి 25, 26 తేదీల్లో బ్యాంకులకు సెలవులు. ప్రస్తుతం బ్యాంకు ఉద్యోగులు ఆదివారాలతో పాటు రెండవ, నాలుగో శనివారాలు సెలవు పొందుతున్నారు.

# గిరిజన జాతర.. మేడారం!



**కొయ్య సెక్కితె బొమ్మరా..కొలిచి మొక్కితె అమ్మరా..! అంటూ కవి అందెశ్రీ పాడిన పాట ఎంతో అద్భుత మైనది. అందులో ఆధ్యాత్మిక తత్వ చింతనను బాగా వెలవరించారు. భారతదేశ పురాణేతిహాసాల్లో విగ్రహాలు, దేవుళ్లు, పూజలు కూడా అంతా నమ్మకం, విశ్వాసం, భక్తిపైనే ఆధారపడి ఉన్నాయి. అందుకే చెట్టు, పుట్టా, గాలీ,నీరు, రాయిరప్పా అన్నీ మనకు దైవాలే. మనకు మేలుచేస్తున్న ప్రకృతిని దైవంగా కొలవడం ఒక్క భారతీయ సంస్కృతిలోనే చూస్తున్నాం. నమ్మకంతో పూజించడం మన ఆచారం. అది దేవత కావచ్చు..మైసమ్మ, మారెమ్మ ఇలా ఏ రూపంలో అయినా గ్రామదేవతనలు కొలవడం ఆచారంగా వస్తోంది. అలాంటి ఓ అద్భుతమైన ఆచారంతో కోట్లాదిమంది ఆరాధ్యదైవాలుగా వెలిసిన వారే సమ్మక్క- సారలమ్మలు. సామాన్యమైన గిరిజన కుటుంబానికి చెందిన వీరు అసామాన్యంగా భక్తులు మనస్సులో నిలిచిపోయారు. కేవలం గిరిజనుల నమ్మకం ఇప్పుడు సమస్త జనజాతికి నమ్మకంగా, ఆరాధ్యంగా ఆ దేవతలు వెలిశారు.**

రెండేళ్లకోమారు జరిగే మేడారాం గిరిజన జాతర చూస్తే..ఆ అమ్మలు జనహృదయంలో ఎంతగా గూడుకట్టుకున్నారో చెప్పలేం. ఇదంతా అమ్మల మీద ఉన్న గౌరవం కావచ్చు..నమ్మకం కావచ్చు.. విశ్వాసం కావచ్చు...కొలిచి మొక్కిన వారికి కొండంత వేల్పులుగా వారు నిలిచి పోయారు. గుడిలేదు.. గంటలు లేవు...కట్టుబాట్లు లేవు..పూజలు, ఆరాధనలు,,హారతులు వంటివి ఏవీ లేకుండా నేరుగా అమ్మలను తలచుకుని మొకకకుని రావడం అన్న ఆధ్యాతిక జాతర బహుశా ప్రపంచంలో ఎక్కడా కానరాదు. ప్రపంచం లోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన మేడారం సమ్మక్క-సారక్క జాతర ప్రారంభం కాబోతున్నది. ప్రారంభానికి ముందే వేలాదిగా భక్తులు తరలివచ్చి గద్దెల వద్ద మొక్కులు తీర్చుకుంటున్నారు. మేడారం అంటే గొప్ప జాతర .. రెండేళ్ల కొకసారి వన దేవతలు భక్తులకు దర్శనమిచ్చి ఆశీర్వదిస్తారు. ఇది కేవలం జాతర మాత్రమే కాదు.. ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన పండుగగా ప్రసిద్ధికెక్కింది. జాతర వచ్చిదంటే తెలుగు రాష్ట్రాలతో పాటు.. భారతదేశం.. ప్రపంచవ్యాప్తంగా భక్తులు మేడారం లో సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను దర్శించుకుంటారు. కుంభమేళా తర్వాత కోట్ల సంఖ్యలో భక్తులను ఆకర్షించే అతిపెద్ద ఉత్సవంగా నిలిచింది. నాలుగు రోజుల జాతరలో పాల్గొనేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తారు.

ఈ ఏడాది జనవరి 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నాలుగు రోజులపాటు అంగరంగ వైభవంగా జాతర నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు చేసింది. ఈ ఏడాది గద్దెలను అభివృద్ధి చేశారు. జాతరకు నెల ముందు నుంచే లక్షలాది మంది మేడారానికి పోటెత్తారు. నిజానికి వనదేవతలైన సమ్మక్క, సారలమ్మ తల్లి-కూతుర్లు... తెలంగాణ ప్రాంతాన్ని కాకతీయ రాజులు సుమారు 700 సంవత్సరాలు పరిపాలించారు. సమ్మక్క సారలమ్మలు జగిత్యాల జిల్లా ప్రాంతానికి చెందిన గిరిజన జాతికి చెందినవారు. గిరిజనుల దొర మేడరాజు అడవిలో వేటాడుతుండగా.. ఒక పుట్టపై పులులు, సింహాలు కాపలాగా ఉన్న పసిపాప సమ్మక్కను చూసి.. ఆ పాపను తీసుకెళ్లి పెంచుకున్నాడని చరిత్ర ద్వారా తెలుస్తుంది. అప్పటి వరకు కరువు.. కాటకాలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు... సమ్మక్క రాకతో సమస్యలు తగ్గిపోయాయి. అంతేకాదు.. ఎలాంటి జబ్బునైనా ఆమె చేతి పసరుతో రోగాలు నయమయ్యాయని చెబుతుంటారు. యుక్తవయస్సు వచ్చిన తర్వాత సమ్మక్కను మేడారం పాలకుడు.... గిరిజన దొర...తన మేనల్లుడు అయిన పగిడిద్ద రాజుకు ఇచ్చి వివాహం చేశారు. వీరి దాంపత్య జీవనంలో సారలమ్మ, నాగులమ్మ అనే ఇద్దరు కుమార్తెలు, జంపన్న అనే కుమారుడు కలిగారు. మేడరాజు పొలవాస ప్రాంతానికి కోయ రాజు కాగా... పగిడిద్ద రాజు మేడారాన్ని పాలించాడని చరిత్ర చెబుతోంది.

కాకతీయ సామ్రాజ్యం విస్తరణలో భాగంగా, కాకతీయ మొదటి ప్రభువు మేడరాజు పాలించిన ప్రాంతాన్ని ఆక్రమించేందుకు దండెత్తాడు. ఈ దాడిని తట్టుకోలేక మేడరాజు తన కుమార్తె సమ్మక్క దగ్గర మేడారంలో ఆశ్రయం పొందుతాడు. పగిడిద్ద రాజు కాకతీయుల సామంతుడిగా ఉంటూ, వారికి ప్రతి నెలా కప్పం కట్టేవాడు. మూడు సంవత్సరాలుగా ఏర్పడిన కరువుల వల్ల కప్పం కట్టలేకపోవడం... మేడరాజుకు ఆశ్రయం ఇవ్వడం వంటి కారణాలతో కాకతీయులు ఆగ్రహించి మేడారంపై దండెత్తారు. కాకతీయ సైన్యాన్ని ఎదుర్కొనేంత బలం లేకపోయినా.. పగిడిద్ద రాజు, సమ్మక్క, సారక్క, వారి పిల్లలు సారలమ్మ, నాగులమ్మ, జంపన్నతో సహా కోయ ప్రజలంతా యుద్ధానికి సిద్ధమయ్యారు. బలమైన ఆయుధాలు, గుర్రాలు, ఏనుగులతో వచ్చిన కాకతీయ సైన్యంతో వందల సంఖ్యలో ఉన్న కోయ ప్రజలు బాణాలు, మొండి కత్తులతో భీకరంగా పోరాడారు. ఈ యుద్ధంలో పగిడిద్ద రాజు, సారలమ్మ, నాగులమ్మ వీరమరణం పొందారు. కుటుంబ సభ్యుల మరణాలను చూసిన జంపన్న.. అవమానాన్ని భరించలేక పక్కనే ఉన్న సంపెంగ వాగులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి ఆ వాగును జంపన్న వాగుగా పిలుస్తున్నారు. తన కుటుంబ సభ్యులందరూ మ-రణించారని తెలిసిన సమ్మక్క, ఏమాత్రం వెనుకాడకుండా కాళీమాతలా విజృంభించి శత్రువులను ఎదుర్కొంది. అయితే, వెనుక నుంచి ఒక సైనికుడు దొంగచాటున పొడిచి సమ్మక్కను తీవ్రంగా గాయపరిచాడు. రక్తం కారుతుండగానే ఆమె చిలుకల గుట్ట వైపు వెళ్లి, నెమలినార చెట్టు కింద ఉన్న పుట్ట దగ్గర కుంకుమ భరిణెగా మారి అదృశ్యమైందని చెబుతుంటారు. సమ్మక్క అదృశ్యమైన తర్వాత, గిరిజన ప్రజలకు ఆకాశం నుంచి కొన్ని మాటలు వినిపించాయి. 'ఈ గద్దమీద పుట్టిన ప్రతి ఒక్కరూ వీరుడిలా రాజ్యాన్ని పాలించాలని, ఇక్కడ రెండు గద్దెలు కట్టి రెండేళ్లకొకసారి ఉత్సవం జరిపిస్తే వారి కోరికలు నెరవేరుస్తాను' అని ఆ మాటల సారాంశం. ఈ మాటలను అమ్మ ఆదేశంగా భావించిన గిరిజనులు.. అప్పటి నుంచి అమ్మలకు జాతర నిర్వహిస్తున్నారు. ప్రతి రెండేళ్లకోసారి మాఘ శుద్ధ పౌర్ణమి రోజున మేడారంలో ఈ మహా జాతర జరుగుతుంది. నాలుగు రోజుల పాటు జరిగే ఈ జాతరలో అనేక సంప్రదాయాలు పాటిస్తారు. మొదటిరోజు కన్నెపల్లి నుంచి సారలమ్మను గద్దెకు తీసుకొస్తారు. రెండవ రోజు చిలుకల గుట్టలోని కుంకుమ భరిణె రూపంలో ఉన్న సమ్మక్కను తీసుకొచ్చి గద్దెపై ప్రతిష్ఠిస్తారు. ఈ దేవతలను గద్దెలపై ప్రతిష్ఠించే సమయంలో భక్తులు పూనకంతో ఊగిపోతారు. మూడవ రోజు అమ్మవార్లు సమ్మక్క, సారక్క ఇద్దరూ గద్దెలపై కొలువుతీరి భక్తులకు దర్శనమిస్తారు. నాలుగవ రోజు సాయంత్రం వారికి ఆవాహన పలికి తిరిగి వనప్రవేశం చేయిస్తారు. దీంతో మేడారం జాతర ముగుస్తుంది. ఈ పూజలను వంశపారంపర్యంగా గిరిజన పూజారులే నిర్వహిస్తారు. అమ్మవార్లకు బంగారంగా బెల్లాన్ని సమర్పించు కోవడం ఇక్కడి ప్రత్యేక ఆచారం.

# చదువులతల్లి సరస్వతి పుట్టిన రోజు

- వసంత పంచమి పుణ్యతిథి శుభప్రదం
- అక్షరాభ్యాసాలకు ప్రత్యేకం



**బాసర, జనవరి 22 :** మాఘ మాసం అంటేనే పర్వదినాలను మోసుకొచ్చేది. ఈ మాసంలో వచ్చే వసంత పంచమితో ఈ పర్వదినాలు ప్రారంభమవుతాయి. ఈ వసంత పంచమిని శ్రీపంచమి అని కూడా అంటారు. ఈ ఏడాది జనవరి 23న శుక్రవారం వసంత పంచమి వచ్చింది. సాక్షాత్తూ చదువుల తల్లి సరస్వతీ దేవి ఈ రోజే జన్మించిందని పురాణాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రముఖ దేవాలయాలు.. బాసర, వర్గిల్, విజయవాడలోని కనక దుర్గమ్మ దేవాలయాలకు భక్తులు పోటెత్తనున్నారు. ఈ రోజు చిన్న పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తే.. వారికి విద్యాబుద్ధులు వికసించి.. భవిషత్తులో ఉన్నత స్థానాలకు చేరతారని నమ్మిక. అందుకే ఈ రోజు తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించేందుకు తల్లిదండ్రులు ఉత్సాహం చూపుతారు. ఈ ఏడాది పంచమి తిథి జనవరి 23 శుక్రవారం తెల్లవారుజామున 2.28 గంటలకు ప్రారంభమవుతుంది. మర్నాడు అనగా.. శనివారం తెల్లవారుజామున 1.46 గంటలకు ముగుస్తుంది. సూర్యోదయం తిథిని ప్రామాణికంగా తీసుకుంటారు కనుక.. జనవరి 23న వసంత పంచమి జరుపుకోవాలని పండితులు స్పష్టం చేస్తున్నారు. ఆ రోజు ఉదయం 7:15 నుంచి మధ్యాహ్నం 12:33 గంటలలోపు సరస్వతీ పూజకు మంచి సమయమని భక్తులకు సూచిస్తున్నారు. పురాణాల ప్రకారం.. బ్రహ్మదేవుడు యావత్ సృష్టికి వాక్కును అందించడానికి సరస్వతీ దేవిని ఈ రోజే.. వసంత పంచమి వేళ సృష్టించారని చెబుతారు. అందుకే ఈ మాఘ శుద్ధ పంచమి సరస్వతీ దేవి జన్మదినంగా పరిగణిస్తారు. విద్యార్థినీ విద్యార్థులతోపాటు సంగీత, సాహిత్య కళాకారులకు ఈ శ్రీ పంచమి గొప్ప పర్వదినమని అభివర్ణిస్తారు. ఆ క్రమంలోనే తమ చిన్నారులతో అమ్మవారి దేవాలయాలకు తల్లిదండ్రులు తరలివెళ్తారు. ఈ వసంత పంచమి వేళ జరిపే పూజల్లో పసుపు వర్ణానికి అధిక ప్రాధాన్యమిస్తారు. పసుపు రంగు.. వసంతకాలం రాకకు సంకేతంగా భావిస్తారు. అలాగే మనలోని జ్ఞానానికి పసుపు వర్ణం సంకేతం. అందుకే ఈ రోజు సరస్వతీ దేవిని దర్శించుకునే భక్తులంతా పసుపు రంగు దుస్తులు ధరిస్తారు. అంతేకాకుండా ఈ రోజు పలు శుభకార్యాలకు అనుకూలమైన తిథి అని పండితులు వివరిస్తారు. అమ్మవారికి.. పసుపు రంగులో ఉండే కేసరి, పులిహోర, పసుపు రంగు తీపి పదార్థాలను నైవేద్యంగా నివేదిస్తారు. వసంత పంచమి రోజు పిల్లలకు అక్షరాభ్యాసం చేయించడం ఎంతో శుభప్రదం. అందుకే తెలంగాణలోని నిర్మల్ జిల్లాలోని బాసర క్షేత్రంలో ఈ వసంత పంచమి రోజు పిల్లలకు అక్షరాభ్యాసం చేయించడం కోసం వేలాదిగా భక్తులు తరలి వస్తారు. ఈరోజు కేవలం అక్షరాభ్యాసాలకు మాత్రమే కాదు.. కొత్త పని ప్రారంభాలకు, వ్యాపారం ప్రారంభానికి, పిల్లలకు పుట్టి వెంట్రుకలు తీయడానికి, అన్నప్రాసన చేయడానికి, నూతన గృహప్రవేశాలు వంటి అనేక శుభకార్యాలకు అత్యంత అనుకూలమైన తిథిగా పండితులు చెబుతారు. ఈరోజున సరస్వతి గుడికి వెళ్లి అమ్మవారికి పూజలు చేయడం, ఇంట్లో సరస్వతీ దేవి పూజ చేయడం, సరస్వతి మంత్రాలు చదవడం, చదువుకునే పిల్లలు మనసులో కోరికలను అమ్మవారికి చెప్పుకోవడం వల్ల సరస్వతీ దేవి అనుగ్రహం కలుగుతుందని విశ్వాసం. అంతే కాకుండా ఈ వసంత పంచమి రోజు ఎవరైతే సరస్వతి దేవికి పూజ చేస్తారు వారికి అమ్మవారి ఆశీస్సులతో పాటు ఏకాగ్రత, పట్టుదల, జ్ఞాపకశక్తి పెరిగి చదువులపై మనసు లగ్నం చేయగలుగుతారని మన పురాణాల్లో చెప్పబడింది. అంతేకాకుండా ఈరోజు చేసే దానాలకు కూడా విశేషమైన ప్రాముఖ్యత ఉంది. అందుకే ఈ వసంత పంచమి రోజు విద్యార్థులు పెన్నులు, బలపాలు, పుస్తకాలు, పెన్సిళ్లు వంటివి తోటి విద్యార్థులకు దానం చేస్తారు. వసంత పంచమి రోజున పిల్లలకు అక్షరాభ్యాసం చేయించడం అత్యంత శుభప్రదమని పండితులు చెబుతున్నారు. ఈ రోజున చదువు ప్రారంభిస్తే పిల్లలు విద్యలో రాణించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుంటారని పండితులు చెబుతున్నారు. పురాణాల ప్రకారం వసంత పంచమి అనేది జ్ఞాన దేవత సరస్వతి దేవి పుట్టిన రోజు కావడంతో పాటు వసంత రుతువు కూడా ప్రారంభమవుతుంది. అక్షరాభ్యాసానికి ముహూర్తంతో సంబంధం లేకుండా చూడకుండా అక్షరాభ్యాసాలు చేస్తారు. ఆరోజు సరస్వతి దేవి చదువుల తల్లి పుట్టిన రోజు కాబట్టి సరస్వతీ దేవి ఆరాధన వల్ల వాక్శుద్ధి కలుగుతుంది. సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పుస్తకాలు, పెన్నులు, బలపాలు వంటి విద్యాసంబంధిత వస్తువులను దానం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఆలోచన, ప్రతిభ, ధారణ, ప్రజ్ఞ, స్ఫురణ శక్తి...వీటి స్వరూపమే సరస్వతీదేవి. అమ్మ అనుగ్రహం ఉంటే సద్బుద్ధిని పొందుతారు..

# తమిళనాడు, కేరళ తరహాలో కర్నాటక గవర్నర్

- ఉభయసభల్లో ప్రసంగించకుండా నిష్క్రమణ
- గవర్నర్ తీరుపై సిఎం సిద్ధరామయ్య ఆక్షేపణ
- రాజ్యాంగ విరుద్ధగా ప్రవర్తించారని ఆగ్రహం



**బెంగళూరు, జనవరి 22 :** తమిళనాడు, కేరళ మాదిరిగానే కర్ణాటకలోనూ గవర్నర్ వ్యవహారం వివాదాస్పదం అయ్యింది. కొత్త ఏడాదిలో కర్ణాటకలో తొలి అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రసంగ ప్రతులను గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ చదవకుండా పక్కన పెట్టారు. 'ఈ రాష్ట్రం ప్రగతి మార్గంలో నడుస్తోంది.. సమావేశాలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నా' అంటూ రెండు లైన్లలో తన ప్రసంగాన్ని ముగించారు. అనంతరం సభ నుంచి వెళ్లిపోయారు. ఈ వ్యవహారం గవర్నర్ కార్యాలయం, రాష్ట్ర ప్రభుత్వం మధ్య విభేదాలకు దారితీసింది. ఈ తీరుపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తంచేసింది. ఇది రాజ్యాంగ వ్యతిరేక చర్యగా సీఎం సిద్ధరామయ్య వ్యాఖ్యలు చేశారు. రెండేళ్లుగా గవర్నర్ థావర్‌చంద్ కాంగ్రెస్ సర్కారు తయారుచేసిన సభా ప్రసంగాలను ఉభయ సభల్లో యథావిధిగా చదివారు. అయితే ఈసారి తన ధోరణిని మార్చుకున్నట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించే అంశాలతో తన ప్రసంగాన్ని సిద్ధం చేసిన తీరును ఆయన ముందుగానే ఆక్షేపించారు. దాంతో గురువారం అసలు ఆయన సభకు వస్తారా లేదా అనే ఉత్కంఠ కనిపించింది. అయితే ఎట్టకేలకు సభకు వచ్చిన ఆయన్ను సీఎం ఆహ్వానించారు. దాంతో ఆ ప్రసంగంపై అభిప్రాయభేదాలు పరిష్కారం అయ్యాయనే అభిప్రాయం కలిగింది. కానీ కొద్దిసేపటికే అలాంటిది ఏమీ లేదని అర్థమైంది. ఆయన కేవలం రెండులైన్లు చదివి సభ నుంచి వెళ్లిపోయారు. క్యాబినెట్ సిద్ధం చేసిన ప్రసంగాన్ని చదవకుండా తాను సిద్ధం చేసుకున్న ప్రసంగాన్ని గవర్నర్ చదివారు. ఆయన రాజ్యాంగబద్ధంగా వ్యవహరించలేదు. దీనిపై మేం నిరసన తెలియజేయ నున్నాం. అలాగే సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశాన్ని పరిశీలిస్తున్నాం అని సిద్ధరామయ్య అన్నారు. కర్ణాటక అసెంబ్లీ సమావేశాల్లో ప్రారంభం రోజే హైడ్రామా నడిచింది. ఉపాధి హామీ పథకానికి సవరణలు వద్దనే తీర్మానంపై కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రసంగాన్ని గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్.. కేవలం రెండు లైన్లు చదివేసి సభ నుంచి వాకౌట్ చేశారు. ఈ ప్రభుత్వం రాష్ట్రంలో ఆర్థిక, సామాజిక పురోగతి వేగాన్ని రెట్టింపు చేయడానికి కట్టుబడి ఉంది. జై హింద్, జై కర్ణాటక!' అంటూ ప్రసంగాన్ని ముగించారు గవర్నర్. దీంతో గవర్నర్ తీరుపై కాంగ్రెస్ నేతలు భగ్గుమన్నారు. గవర్నర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'లోక్ భవన్ బీజేపీ కార్యాలయంగా మారిందా అని గవర్నర్‌ను ప్రశ్నించారు. గవర్నర్ గహ్లోత్ అసెంబ్లీ నుంచి వాకౌట్ చేసిన తర్వాత.. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మీడియాతో మాట్లాడారు. 'ప్రతి కొత్త సంవత్సరం గవర్నర్ అసెంబ్లీ ఉమ్మడి సమావేశంలో ప్రసంగించాలి. ఆ ప్రసంగ పత్రాలను క్యాబినెట్ తయారు చేయాలి. ఇది రాజ్యాంగబద్ధమైన అవసరం. నేడు క్యాబినెట్ తయారు చేసిన ప్రసంగాన్ని చదవడానికి బదులుగా.. గవర్నర్ స్వయంగా రూపొందించుకున్న ప్రసంగాన్ని చదివారు. ఇది భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమే. రాజ్యాంగంలోని ఆర్టికల్ 176, 163ను ఉల్లంఘనల కిందకు వస్తుంది. రాజ్యాంగం ప్రకారం.. ఆయన తన విధులను సక్రమంగా నిర్వర్తించలేదు. అందువల్ల గవర్నర్ వైఖరికి వ్యతిరేకంగా నిరసన తెలపబోతున్నాం. సుప్రీంకోర్టును ఆశ్రయించాలా.. వద్దా.. అని పరిశీలిస్తున్నాం' అని సిద్ధరామయ్య అన్నారు.

## గాయని జానకి ఇంటి విషాదం

### కుమారుడు మురళీకృష్ణ అస్తమయం

**చెన్నై, జనవరి 22 :** దక్షిణాది ప్రముఖ గాయని ఎస్.జానకి ఇంట విషాదం చోటు చేసుకుంది. ఆమె ఏకైక కుమారుడు మురళీకృష్ణ (65) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, పరిస్థితి విషమించడంతో గురువారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని గాయని కె.ఎస్ చిత్ర సోషల్ మీడియా వేదికగా తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 'మేమంతా ఎంతో ఇష్టపడే సోదరుడు, మన ప్రియమైన జానకి అమ్మగారి ఏకైక కుమారుడు మురళీ ఆకస్మికంగా మరణం ఎంతో షాక్‌కి గురి చేసింది. మంచి సోదరుడిని కోల్పోయాం. భరించలేని ఈ దుఃఖాన్ని, విషాదాన్ని అధిగమించేందుకు జానకమ్మకు ఆ భగవంతుడు అపారమైన శక్తిని ఇవ్వాలని ప్రార్థిస్తున్నాను. మురళీ ఆత్మ శాంతించాలని కోరుకుంటున్నా' అని చిత్ర పోస్ట్‌లో పేర్కొన్నారు. మురళీకృష్ణ జానకి కుమారుడిగానే కాకుండా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన సుప్రసిద్ధ భరతనాట్య కళాకారుడు. శాస్త్రీయ నృత్యంలో మంచి ప్రావీణ్యం ఉన్న ఆయన, పలువురు విద్యార్థులకు శిక్షణ కూడా ఇచ్చారు. అంతేకాకుండా, నటనపై ఉన్న ఆసక్తితో 'వినాయకుడు', 'మల్లెపువ్వు' వంటి చిత్రాల్లో నటించారు. కన్నడ సినిమా 'కూలింగ్ గ్లాస్'కు రచయితగానూ వర్క్ చేశారు. మురళీకృష్ణకు భార్య ఉమ, ఇద్దరు కుమార్తెలు వర్ష, అప్సర ఉన్నారు.

## అటెన్షన్ డైవర్షన్ స్కీమ్

### కెటిఆర్‌కు నోటీసులపై బిఆర్ఎస్ నేతల ఆగ్రహం

**హైదరాబాద్, జనవరి 22 :** కెటిఆర్‌కు సిట్ నోటీసులపై బిఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. ఇదంతా కేవలం డైవర్షన్ స్కీమ్ అంటూ విమర్శలు గుప్పించారు. బొగ్గు స్కామ్‌పై సమాధానం చెప్పలేక .. నిన్న నాకు, ఇవాళ కేటీఆర్‌కు సిట్ నోటీసులు ఇచ్చారని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్ని నోటీసులు ఇచ్చినా.. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేసే వరకు వెంట పడుతూనే ఉంటామన్నారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా.. ఎన్ని అటెన్షన్ డైవర్షన్లు చేసినా సీఎం ను వదిలిపెట్టబోమని హెచ్చరించారు. బామ్మర్ది బాగోతం బయటపెట్టడంతో ఈ నోటీసులు ఇస్తున్నారని అన్నారు. రెండేళ్ల క్రితం నుంచి సడీచప్పుడు లేకుండా ఇప్పుడే నోటీసులు ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటో ప్రజలకు తెలుసన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్‌కు సిట్ నోటీసులు కాంగ్రెస్ సర్కారు నాటకమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ధ్వజమెత్తారు.పాలన గాలికి వదిలి సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి చేస్తున్న చిల్లర ప్రయత్నాలు ఇవి. రాష్ట్రంలో యూరియా దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్టాన్ని ప్రజల కర్మానికి వదిలేసి దావోస్, అమెరికా పర్యటన పెట్టుకున్నారు. సర్కారు డబ్బుతో జల్సాలు చేస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో పసలేదని న్యాయస్థానాలు తేల్చి చెప్పినా.. కాంగ్రెస్ ప్రభుత్వం మొగలి రేకులు సీరియల్ నడిపిస్తోంది. రేవంత్‌రెడ్డి విదేశాల్లో విహరిస్తూ అక్కడి నుంచి వచ్చే వరకు ఈ సీరియల్ నడిచేలా చేసినట్లు అనిపిస్తోంది. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో అన్ని ప్రభుత్వ శాఖల వెన్ను విరిచారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ నేతలకు నోటీసులు ఇవ్వడం హాస్యాస్పదం అని నిరంజన్‌రెడ్డి అన్నారు. రెండేళ్ల క్రితం నమోదైన కేసులో కేటీఆర్‌కు సిట్ నోటీసులు ఇచ్చిందని బీఆర్ఎస్ నేత సోమా భరత్ విమర్శించారు. 'నోటీసు ఇచ్చి .. విచారణకు వచ్చేందుకు కనీసం 24 గంటల సమయం కూడా ఇవ్వలేదు. రెండ్రోజుల క్రితం మరో సీనియర్‌నేత హరీశ్ రావుకు నోటీసులు ఇచ్చారు. కేవలం ప్రశ్నిస్తున్న పార్టీ లక్ష్యంగానే నోటీసులు ఇస్తున్నారు. సిట్ ఎందుకు వేశారో కూడా తెలియదు. ఒక పద్ధతి లేకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. కాంగ్రెస్ అక్రమాలను బయటపెడుతుంటే నోటీసులు ఇస్తున్నారు. విచారణకు కేటీఆర్‌తో పాటు న్యాయవాదిని అనుమతించాలని కోరాం. సాక్షిగా విచారణ చేసినప్పుడు న్యాయవాదిని అనుమతించబోమని ఏసీపీ చెప్పారని భరత్ తెలిపారు.




## డ్రగ్స్ వద్దూ.. పుస్తకాలే ముద్దు.!

### ఫిబ్రవరి 22 'రన్ ఫర్ డ్రగ్ ఫ్రీ లైఫ్' గోడ పత్రికను ఆవిష్కరించిన తుంగతుర్తి

**పీర్జాదిగూడ, నేడు న్యూస్:** డ్రగ్స్ మహామారికి బానిసై విద్యార్థి దశలోనే బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని గ్రేటర్ హైదరాబాద్ బోడుప్పల్ మున్సిపల్ సర్కిల్ పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆర్.వి. ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి అన్నారు. చదువుకోవాల్సిన వయసులో విద్యార్థులు తెలిసీ తెలియక డ్రగ్స్ అలవాటు చేసుకుంటున్నారని, దీంతో తల్లిదండ్రుల ఆశలు, ఆశయాలను దూరం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సాయి ప్రియ కాలనీలోని ఆర్.వి. కన్స్ట్రక్షన్ కార్యాలయంలో గురువారం 'రన్ ఫర్ డ్రగ్ ఫ్రీ లైఫ్' గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి 22న ఆదివారం నారపల్లిలోని భాగ్యనగర్ నందనవనం పార్కులో 16కే, 10కే, 5కే, 3కే నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాల్సిన బాధ్యత ఉందన్నారు. అన్నింటికన్నా ఆరోగ్యమే ముఖ్యమని, ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని ఆయన కోరారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని, ప్రస్తుతం అనవసరంగా ఆసుపత్రిలో చేరి అడ్డగోలుగా డబ్బులు ఖర్చు చేయవద్దని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి సహితం డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాడని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో శాంతివనం రన్నర్స్ నిర్వాహకులు డాక్టర్ కట్ట శేఖర్, మహేందర్ రెడ్డి, సోమశేఖర్, నర్సింహా నాయక్, జర్నలిస్టులు గొడిసశాల సోమయ్య, రాజాపేట నవీన్ చారి, శ్రీనివాస్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈడీ విచారణకు హాజరైన విజయసాయి

### లిక్కర్ స్కామ్‌పై విచారణ



**హైదరాబాద్, జనవరి 22 :** ఏపీ లిక్కర్ స్కాం కేసులో వైసీపీ మాజీ ఎంపీ విజయసాయి రెడ్డిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చేపట్టిన విచారణ ముగిసింది. హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో విజయసాయిని దాదాపు 7 గంటల పాటు అధికారులు ప్రశ్నించారు. విచారణలో భాగంగా లిక్కర్ పాలసీ రూపకల్పన, విధాన నిర్ణయాలు, అలాగే రహస్య ఆర్థిక లావాదేవీలపై ఈడీ ఆరా తీసింది. లిక్కర్ పాలసీకి సంబంధించిన సమావేశాలు తన సమక్షంలోనే మూడు సార్లు జరిగినట్లు విజయసాయి రెడ్డి ఈడీకి స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు సమాచారం. అదేవిధంగా.. విదేశాలకు నగదు తరలింపు అంశం, షెల్ కంపెనీల ఏర్పాటు, వాటి ద్వారా జరిగిన లావాదేవీలపై కూడా అధికారులు ప్రశ్నలు సంధించారు. షెల్ కంపెనీల ద్వారా అంతిమ లబ్దిదారులు ఎవరు అనే అంశంపై ఈడీ ప్రత్యేకంగా వివరాలు కోరినట్లు సమాచారం. విచారణ సమయంలో ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన కొన్ని కీలక డాక్యుమెంట్లను విజయసాయి రెడ్డి ఈడీ అధికారులకు సమర్పించారు. ఈ మేరకు ఆయన స్టేట్‌మెంట్‌ను కూడా ఈడీ అధికారులు రికార్డు చేశారు.



## జన్వాడ ప్రభుత్వ పాఠశాలలో రోడ్డు భద్రతపై మోకిల పోలీసుల అవగాహన సదస్సు

**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** ట్రాఫిక్ రూల్స్ పాటించడం ద్వారా ప్రమాదాలను అరికట్టవచ్చని మోకిల సిఐ వీరబాబు అన్నారు. గురువారం రోజు మోకిల పోలీసుల ఆధ్వర్యంలో జన్వాడ గ్రామంలో అరైవ్ అలైవ్ లో భాగంగా రోడ్డు భద్రతపైన అవగాన సదస్సు, ఈజీ రైటింగ్ అండ్ ప్రింటింగ్ కాంపిటీషన్ నిర్వహించడం జరిగింది. విద్యార్థులను ఉద్దేశించి మోకిల ఇన్స్పెక్టర్ వీరబాబు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, హెల్మెంట్, సీటు బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, రాంగ్ రూట్, సూచించారు. త్రిబుల్ రైడింగ్ చేయరాదని, వాహనం నడిపేటప్పుడు సంబంధిత అన్ని పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. ఏదైనా ఎమర్జెన్సీ ఉంటే 100- డయ ల్ కి కాల్ చేసి సమాచారం ఇస్తే తక్షణమే స్పందిస్తామన్నారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని, కాంపిటీషన్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డి ఐ సమరం రెడ్డి, ఎసఐలు ధర్మ రాథోడ్, పద్మ, ఎం ఈ ఓ అక్బర్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పట్ల ముందుండే సిపిఐ పార్టీకే ప్రజల మద్దతు

- సిపిఐ జిల్లా కార్యదర్శి పాల మాకుల జంగయ్య
- మున్సిపల్ ఎన్నికలలో కలిసివచ్చే వామపక్ష, లౌకిక పార్టీలతో కలిసి సిపిఐ పోటీకి సిద్ధం

**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** భారత కమ్యూనిస్టు పార్టీ ముఖ్య నాయకుల సమావేశం చేవెళ్లలోని పార్టీ కార్యాలయంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, నియోజకవర్గ ఇన్చార్జి కె రామస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....రాబోయే మున్సిపల్ ఎన్నికలలో చేవెళ్ల ,మొయినాబాద్ శంకర్ పల్లి, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలలో సిపిఐ పార్టీ తో కలిసి వచ్చే లౌకిక, వామపక్ష పార్టీలతో కలిసి భారత కమ్యూనిస్టు పార్టీ మున్సిపల్ ఎన్నికల పోటీలో పాల్గొంటుందని తెలిపారు. చేవెళ్ల మున్సిపాలిటీలో 4 వార్డులు, మొయినాబాద్ మున్సిపాలిటీలో 3 వార్డులు, శంకర్ పల్లి మున్సిపాలిటీలో 3 వార్డులు, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో 2 వార్డుల లో భారత కమ్యూనిస్టు పార్టీ పోటీలో ఉంటుందని ఆయన తెలిపారు. నిరంతరం ప్రజా పోరాటాలు, కార్మిక పోరాటాలలో ముందుండి పోరాటం చేసే భారత కమ్యూనిస్టు పార్టీకి ప్రజల అండదండలు ఉన్నాయని, ప్రజా పోరాటాలే మా పార్టీకి బలం అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ప్రభులింగం, జిల్లా కార్యవర్గ సభ్యుడు వడ్ల సత్యనారాయణ, చేవెళ్ల మండల పార్టీ కార్యదర్శి ఎం సత్తిరెడ్డి, శంకర్ పల్లి మండల కార్యదర్శి సుధీర్, ఇన్సాబ్ జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బూల్, బి కె ఎం యు జిల్లా అధ్యక్షుడు జె అంజయ్య, పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ శౌరీలు, శివ, పాపయ్య పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.



## పెండింగ్ పనులు వేగంగా పూర్తి చేయాలి

### కమీషనర్‌ను కోరిన శ్యామ్ రావు

**పటాన్ చెరువు, రాజముద్ర న్యూస్:** నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలోని సమస్యల పరిష్కారం గురించి మర్యాదపూర్వకంగా కలిసి, పఠాన్ చెరువు పరిధిలోని పలు ప్రజా సమస్యలు, అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు. ముఖ్యంగా పారిశుధ్యం, రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో జిహెచఎంసి అధికారుల సహకారం కీలకమని డి సి సి వర్కింగ్ ప్రెసిడెంట్ పర్స శ్యామ్ రావు తెలిపారు. ఈ సర్కిల్ కార్యాలయంలో నూతనంగా చేరిన కొత్త డివిజన్ ల యొక్క స్థితిగతుల గురించి చర్చించడం జరిగిందని, అన్ని డివిజన్లలో అభివృద్ధి కార్యక్రమాలకు అందరి సహాయ సహకారాలు ఉండాలని కోరారు.

## నేడు పటాన్ చెరువు నియోజకవర్గానికి ఇన్చార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి రాక

### కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం

**పఠాన్ చెరువు, రాజముద్ర న్యూస్:** 23-01-26 రోజున ఉదయం 10 గంటలకు ముత్తంగి ఇంద్రేశం,ఇస్నాపూర్ మున్సిపాలిటీ ల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం మధ్యాహ్నం 12 గంటలకు ఎన్,ఎస్,ఆర్ ఫంక్షన్ హాల్ లో జరుగుతుందని, జిన్నారం, గడ్డపోతారం, గుమ్మడిదల మున్సిపాలిటీల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం పటాన్ చెరువు నియోజకవర్గ ఇన్చార్జి కాట శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి



ముఖ్యఅతిథిగా మంత్రి ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్చార్జి వివేక్ వెంకటస్వామి, డిసిసి అధ్యక్షులు నిర్మల జగ్గారెడ్డి, మెదక్ పార్లమెంట్ కంటెస్టెడ్ అభ్యర్థి నీలం మధు హాజరవుతున్నారని, ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, అనుబంధ సంస్థల నాయకులు, హాజరుకావాలని ఒక ప్రకటనలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

# ములుగులో అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట

- అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు, గోదావరి జలాలు సకాలంలో చేరేలా చర్యలు
- మంత్రి ధనసరి అనసూయ సీతక్క



**ములుగు, జనవరి 22:** ములుగు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజా ప్రభుత్వం పూర్తిగా మద్దతు ప్రకటిస్తూ, నిధులను మంజూరు చేస్తోందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా--శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. గురువారం ములుగు మండలం జీవాంతరావుపల్లి లోని గ్రామ పంచాయతీ భవనం, హనుమాన్ టెంపుల్ ప్రహరీ గోడ, డబుల్ లైన్ రోడ్లు, సెంట్రల్ లైటింగ్ లు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా, గత ప్రభుత్వంలో అభివృద్ధి కార్యక్రమాలకు సముచిత నిధులు కేటాయించలేదని, ప్రజా ప్రభుత్వంలో మంత్రిగా కొనసాగుతూ గ్రామ అభివృద్ధికి పెద్దపీట వేసినట్లు వివరించారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని, లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాన్ని పూర్తి చేయాల్సిందని మంత్రి సీతక్క సూచించారు. అలాగే, సమ్మక్క--సారక్క బ్యారేజీ నుండి ములుగు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలకు గోదావరి జలాలను తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 143 కోట్ల రూపాయలతో లిఫ్ట్ వ్యవస్థ ఏర్పాటు చేసి, రెండు పంటలు పండే విధంగా నీటి సరఫరా చేపట్టబడుతున్నది. మేడారం-రామప్ప ప్రాంతాలకు రోడ్డు, పర్యాటక సౌకర్యాలు, ఐలాండ్ నిర్మాణం, శివ విగ్రహ ఏర్పాటు వంటి ప్రాజెక్టులను కూడా చేపడతామని మంత్రి తెలిపారు. అలాగే, మహిళా సంఘాల 560 సభ్యులకు ఆర్థిక సహా యం చేసి వ్యాపార అవకాశాలను సృష్టించడం ద్వారా వెనుకబడిన ప్రాంతాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రవి చందర్, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నగర ప్రజలను మభ్యపెట్టే రాజకీయాలు మానుకోవాలి

### మాజీ మేయర్ సునీల్ రావు

**కరీంనగర్, జనవరి 22:** కరీంనగర్ నగర రాజకీయాల్లో అనవసర ఆరోపణలు, వ్యక్తిగత విమర్శలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని బీజేపీ మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు విమర్శించారు. గురువారం కరీంనగర్ భగత్‌నగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ నాయకత్వం అవలంబిస్తున్న రాజకీయ శైలి ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ఉందని ఆరోపించారు. పార్టీకి సంవత్సరాల తరబడి సేవలందించిన సీనియర్ నాయకులను పక్కనబెట్టి, ప్రతిపక్షంలో పనిచేసిన నేతలపై వ్యక్తిగత దాడులు చేయడం సరికాదన్నారు. ప్రజా సమస్యలపై మాట్లాడాల్సిన సమయంలో ఆరోపణలకే ప్రాధాన్యం ఇస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని మండిపడ్డారు. అక్రమ కాంట్రాక్టులు, అవినీతిపరమైన వ్యవహారాల ద్వారా సంపాదించిన డబ్బుతో రాజకీయ పదవులు కొనుగోలు చేసే సంస్కృతి కాంగ్రెస్ పార్టీలో పెరిగిందని సునీల్ రావు ఆరోపించారు. ఒకవైపు తమ పార్టీ నాయకులపై, మరోవైపు ఇతర పార్టీల నేతలపై తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అంతర్గత సమావేశాల్లోనే తమ నాయకత్వంపై అసంతృప్తి వ్యక్తమవుతోందంటే, ఆయా నేతల రాజకీయ విలువ ఏంటో ప్రజలకు అర్థమవుతోందని వ్యాఖ్యానించారు. పలుమార్లు ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలైనప్పటికీ రాజకీయ ప్రవర్తనలో మార్పు రాకపోవడం దురదృష్టకరమన్నారు. తాము గత 35 ఏళ్లుగా ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజల మధ్య పనిచేస్తూ రాజకీయ



జీవితాన్ని నిర్మించుకున్నామని తెలిపారు. అక్రమ మార్గాల్లో సంపాదించిన సొమ్ముతో రాజకీయాలు చేసే వారు తాము కాదని స్పష్టం చేశారు. ఐదుసార్లు ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులమని, ప్రజల మద్దతు, దీవెనలతోనే రాజకీయాల్లో కొనసాగుతున్నామని చెప్పారు. కరీంనగర్ నగర అభివృద్ధిలో తమ పాత్ర స్పష్టంగా కనిపిస్తోందని, గత ఐదేళ్లలో నగరం సాధించిన ప్రగతి ప్రజల కళ్లకు కనబడుతోందని అన్నారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టు సహా పలు అభివృద్ధి పనులు తమ హయాంలోనే జరిగాయని గుర్తు చేశారు. తాము 365 రోజులు ప్రజల మధ్య ఉండే రాజకీయ నాయకులమని, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ వారి కష్టనష్టాల్లో భాగస్వాములమని సునీల్ రావు పేర్కొన్నారు. నిరాధార ఆరోపణలు చేస్తే తాము మౌనంగా ఉండబోమని హెచ్చరించారు. ప్రజాక్షేత్రంలో ప్రజల మద్దతుతోనే విజయం సాధించే ధైర్యం, సత్తా తమకు ఉందని స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ మాజీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కృష్ణారెడ్డి మృతదేహానికి నివాళులు

**కారేపల్లి :** ఖమ్మం జిల్లా కారేపల్లి మండల పరిధిలోని గాదెపాడు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దాచేపల్లి కృష్ణారెడ్డి గుండెపోటుతో మృతి చెందడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. కృష్ణారెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్ భరోసా ఇచ్చారు. మృతుడు కృష్ణారెడ్డి స్వగ్రామమైన గాదెపాడుకు వారు వేరువేరుగా చేరుకుని భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ఈ దుఃఖాన్ని అధిగమించేలా ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పగడాల నాగరాజు, మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్ ముఖ్య అనుచరులు అజ్మీరా వీరన్న నాయక్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, టీఆర్ఎస్ జిల్లా యూత్ విభాగం నాయకుడు ముత్యాల వెంకట అప్పారావు, మాజీ జెడ్పీటీసీ ఉన్నం వీరేందర్, మాజీ వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు. అలాగే బీఆర్ఎస్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ధరావత్ మంగీలాల్, అడప పుల్లారావు, బానోత్ దేవుల నాయక్, హనుమకొండ రమేష్, కొండబోయిన నాగేశ్వరరావు, తాత వెంకన్న, బానోత్ రాందాస్, గడిపర్తి వీరన్న, నానబాల మల్లయ్య, సత్యనారాయణ, పంతులు నాయక్ తదితరులు హాజరై కృష్ణారెడ్డికి చివరి నివాళులర్పించారు.

## మార్కోడు ఆశ్రమ పాఠశాలపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**ఆళ్లపల్లి, జనవరి 23 (రాజముద్ర న్యూస్):** మార్కోడు గ్రామంలోని ఆశ్రమ పాఠశాలను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ప్రాంగణం, తరగతి గదులు, హాస్టల్ గదులు, మరుగుదొడ్లు, డైనింగ్ హాల్‌తో పాటు మౌలిక వసతులన్నింటినీ కలెక్టర్ పరిశీలించారు. మరుగుదొడ్లలో నీటి సరఫరా సక్రమంగా లేకపోవడాన్ని గమనించిన కలెక్టర్, తక్షణమే నిరంతర నీటి సరఫరా కల్పించాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో భవనంలో లికేజీ సమస్య ఉన్నట్లు ఉపాధ్యాయులు తెలియజేయగా, అవసరమైన మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని సూచించారు. డైనింగ్ హాల్‌లో స్టాక్ రిజిస్టర్లు, వంట నిర్వహణను తనిఖీ చేసిన కలెక్టర్, విద్యార్థులకు శుభ్రమైన, పోషకాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. వంట సిబ్బంది పరిశుభ్రత నిబంధనలను కచ్చితంగా పాటించాలని, విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. లోటుపాట్లు తలెత్తితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కిచెన్ షెడ్ నిర్మాణానికి నివేదికలు వెంటనే సమర్పించాలని, వంటకట్టెలపై ఆధారాన్ని తగ్గించి గ్యాస్ సరఫరా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం మూడవ, ఆరవ, ఎనిమిదవ తరగతులను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులతో మమేకమై, వారికి అందుతున్న సదు-పాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉన్నత లక్ష్యాలను నిర్ధారించుకుని చదువుపై పూర్తి దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థుల చదవడం, రాయడం నైపుణ్యాలను పరిశీలించి అభ్యాస స్థాయిని పరీక్షించారు. ఈ సందర్భంగా



కలెక్టర్ మాట్లాడుతూ, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు సురక్షిత వాతావరణం, మెరుగైన వసతులు, నాణ్యమైన విద్య, పోషకాహారం తప్పనిసరిగా అందాలని తెలిపారు. పాఠశాలల నిర్వహణలో నిర్లక్ష్యం చోటు చేసుకోరాదని, చిన్న లోపం కూడా విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందని అన్నారు. అనంతరం మార్కోడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. కొత్త తరగతి గదులు, కిచెన్ షెడ్, కాంపౌండ్ వాల్, మరుగుదొడ్ల నిర్మాణాలను పరిశీలించి, పది రోజుల్లోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని, లోపాలుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యుతీకరణ పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పర్యటనలో కలెక్టర్ వెంట ప్రధానోపాధ్యాయులు ముత్తయ్య, రామకృష్ణ, బోధన మరియు బోధనేతర సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ప్రాణాల రక్షణే లక్ష్యంగా బ్లాక్ స్పాట్లలో ప్రత్యేక చర్యలు

### బ్లాక్ స్పాట్ల గుర్తింపు, నివారణ చర్యలపై అధికారులకు కలెక్టర్ ఆదేశాలు


**కరీంనగర్, జనవరి 22:** జిల్లాలో రోడ్డు ప్రమాదాల వల్ల ప్రాణ నష్టం జరగకుండా బ్లాక్ స్పాట్లను గుర్తించి ప్రత్యేక నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆమె స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఆర్ అండ్ బి, పోలీస్, రవాణా, ఆర్టీసీ, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో జిల్లా రోడ్డు భద్రత కమిటీ, జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలపై ఇప్పటివరకు తీసుకున్న చర్యల వివరాలను అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించి, అక్కడ ప్రమాదాల కారణాలను సమగ్రంగా విశ్లేషించి తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రమాదాల అవకాశమున్న ప్రాంతాల్లో హెచ్చరిక సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, వాహనాల వేగ నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్పీడ్ బ్రేకర్లు, రోడ్డు లైటింగ్, లేన్ మార్కింగ్స్ వంటి మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. నేషనల్ హైవే అథారిటీ, పంచాయతీరాజ్, మున్సిపల్ కార్పొరేషన్, పోలీస్, రోడ్లు--భవనాలు, రవాణా శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆర్టీసీతో పాటు ప్రైవేట్ బస్సుల్లో తప్పనిసరిగా ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ట్రాఫిక్ నిబంధనలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ, కరీంనగర్--జగిత్యాల రహదారి ఇరువైపులా ఆరు అడుగుల మేర చదును చేయాలని సూచించారు. జిల్లాలో అవసరమైన చోట్ల స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక సైన్ బోర్డులు, లైటింగ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్ల వివరాలతో పాటు అక్కడ చేపట్టాల్సిన నివారణ చర్యలను వివరించారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు నగరంలో అవసరమైన ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు, ట్రాఫిక్ సిగ్నల్స్, సోలార్ లైటింగ్ సిస్టంలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాజెక్ట్ డైరెక్టర్ కీర్తి భరద్వాజ్ జాతీయ రహదారి 563లో ప్రమాదాల నివారణకు చేపట్టిన చర్యలను వివరించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్‌టిఏ సభ్యులు పడాల రాహుల్, రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ పురుషోత్తం, ఆర్టీసీ డీఎం సునంద, ఏసీపీ వెంకటస్వామి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## తుమ్మల యుగంధర్ విస్తృత పర్యటన

### విద్య, మహిళలు, సమగ్ర అభివృద్ధి పై దృష్టి

**ఖమ్మం:** తుమ్మల యుగంధర్ ఖమ్మం మూడవ పట్టణం లోని పలు ప్రాంతాల్లో విస్తృత పర్యటన నిర్వహించి, విద్య, మహిళల సాధికారత, సాంస్కృతిక వేడుకలు మరియు అభివృద్ధి పనులపై తన దృష్టిని సారించారు. 17వ డివిజన్‌లోని గీతాంజలి పాఠశాలను సందర్శించి విద్యార్థులు మరియు విద్యార్థినులతో ముచ్చటించారు. చదువులో ముందడుగు వేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రోత్సాహపెట్టారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా స్వయం ఆధారపడే విధంగా కుట్టు మిషన్లు పంపిణీ చేసి, ఉపాధి అవకాశాలను సృష్టించడం ద్వారా ఆర్థిక స్వాతంత్ర్యాన్ని ప్రోత్సహించారు. తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి గాంచిన మేడారం జాతర సందర్భంగా 47వ డివిజన్ లో అంగరంగ వైభవంగా ఏర్పాటు చేసిన అమ్మవారి ఉత్సవాలను ప్రారంభించారు. స్థానికులు వేడుకలో భాగంగా ఉత్సాహంగా పాల్గొన్నారు. 46వ డివిజన్‌లోని సోదరుడు రేగు రవీందర్ కు చెందిన ఇరాని కేఫ్ ను సందర్శించి, అక్కడ ఉన్న వారందరినీ పలకరించి, వారితో కూర్చుని టీ తాగుతూ సాన్నిధ్యం సాధించారు. 30వ డివిజన్‌లోని ఫిల్టర్ బెడ్‌ను పరిశీలించి, అక్కడ జరుగుతున్న రిటైనింగ్ వాల్ పనులను కచ్చితంగా పరిశీలించారు.



# గాజా శాంతి మండలిని ప్రారంభించిన ట్రంప్..

## సభ్యదేశంగా పాక్

**దావోస్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గాజా శాంతి మండలిని ప్రారంభించారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో దీనిని అధికారికంగా ప్రకటించారు. "ప్రతిఒక్కరు ఈ మండలిలో భాగం కావాలని కోరుతున్నాను. ఐరాసతో సహా అందరితో కలిసి పనిచేస్తాను" అని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. మండలి సభ్య దేశాల్లో పాకిస్థాన్ ఉండటం గమనార్హం. గాజా పునర్నిర్మాణాన్ని, పాలనను పర్యవేక్షించడం కోసం కొన్నిరోజుల క్రితం అధ్యక్షుడు దీని ఏర్పాటు గురించి ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. ఈ మండలికి ట్రంప్ ఛైర్మన్. ఆ హోదాలో ఆయన కొంత మంది సభ్యులను మాత్రమే నియమిస్తారని తొలుత అంతా భావించారు. కానీ ఇప్పటివరకు ఆయన 50 మందికిపైగా దేశాధినేతలకు ఆహ్వానాలు పంపారు. ఇందులో భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సహా పలు దేశాల అధినేతలు ఉన్నారు. ఐరాస స్థానంలో ట్రంప్ ఈ గాజా శాంతి మండలిని తీసుకువస్తున్నారనే చర్చ నడుస్తోంది. ""ఐరాస ఎంతో చేయాల్సి ఉందన్నది నా భావన. అలా చేసుంటే ఈ శాంతి మండలి అవసరమే ఉండేది కాదు" అని ఆయన చేసిన వ్యాఖ్యలతో ఇది గాజాకు పరిమితమైన మండలి కాదన్న విషయం స్పష్టమవుతోంది. ఇందులో శాశ్వత సభ్యత్వం పొందాలనుకునే దేశం ఒక బిలియన్ డాలర్లు (రూ. 9వేల కోట్లకు పైగానే) చెల్లించాల్సి ఉంటుంది.

### హమాస్‌కు వార్నింగ్..

గాజా శాంతి మండలికి సంబంధించి ట్రంప్ ఆధ్వర్యంలో పలువురు నేతలు సంతకాలు చేశారు. వారిలో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు.. మిలిటెంట్ గ్రూప్ హమాస్‌కు వార్నింగ్ ఇచ్చారు. "వారు ఆయుధాలు విడనాడేందుకు అంగీకరించకపోతే.. వారి అస్తిత్వానికే నష్టం" అని హెచ్చరించారు. ఇజ్రాయెల్-హమాస్ మధ్య ట్రంప్ కుదిర్చిన 20 సూత్రాల కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగానే దీనిని ఏర్పాటు చేశారు.



# ఖలిస్థానీ వేర్పాటువాదుల దుశ్చర్య..

## భారత ఎంబసీలోకి చొరబడి

**క్రొయేషియా :** ఐరోపా దేశమైన క్రొయేషియా లో ఖలిస్థానీ వేర్పాటువాదులు దుశ్చర్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. రాజధాని జాగ్రెబ్‌లోని భారత రాయబార కార్యాలయంలోకి చొరబడి విధ్వంసం సృష్టించినట్లు సమాచారం. దీనికి సంబంధించిన వీడియోలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. ఐరోపా కూటమి ప్రతినిధులు త్వరలో భారత్‌లో పర్యటించనున్న వేళ ఈ ఘటన చోటుచేసుకుంది. దీన్ని భారత విదేశాంగశాఖ తీవ్రంగా ఖండించింది. "భారత వ్యతిరేక శక్తులు మా రాయబార కార్యాలయంలోకి చొరబడి, విధ్వంసం సృష్టించిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాం. వియన్నా ఒప్పందం ప్రకారం.. దౌత్య ప్రాంగణాల్లో నిబంధనల ఉల్లంఘనలు జరగకూడదు. ఈ వ్యవహారాన్ని క్రొయేషియా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరాం. ఇటువంటి ఘటనలు.. వాటి వెనుక ఉన్న వ్యక్తుల స్వభావాన్ని, ఉద్దేశాలను సూచిస్తాయి. అధికారులు వాటిని గుర్తించి అప్రమత్తంగా ఉండాలి" అని భారత విదేశాంగశాఖ ప్రకటన విడుదల చేసింది. గతంలో కెనడా, బ్రిటన్, అమెరికా తదితర దేశాల్లోనూ ఖలిస్థానీ వేర్పాటువాదులు ఇదే తరహా దుశ్చర్యలకు పాల్పడ్డారు. వీటిని భారత్ ఖండించింది. ఉగ్రవాదాన్ని అరికట్టడంలో కెనడా 40 ఏళ్లుగా విఫలమవుతూనే ఉందని అక్కడి భారత హైకమిషనర్ దినేశ్ పట్నాయక్ ఇటీవల పేర్కొన్నారు. ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య కేసులో భారత్‌పై కెనడా ఆరోపణలను తిప్పికొట్టారు.

# ఆస్ట్రేలియాలో మరోసారి కాల్పుల కలకలం.. ముగ్గురి మృతి




**లేక్ కార్గెలిగో :** సిడ్నీ ఉగ్రదాడి ఘటన మరువకముందే ఆస్ట్రేలియాలో మరోసారి కాల్పులు కలకలం రేపాయి. న్యూ సౌత్ వేల్స్‌లోని లేక్ కార్గెలిగో పట్టణంలో గుర్తుతెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు మృతి చెందారు. మరొకరు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. మృతుల్లో ఇద్దరు మహిళలు ఉన్నట్లు వెల్లడించారు. ఘటనానంతరం దుండగులు అక్కడినుంచి పరారైనట్లు చెప్పారు. సిడ్నీ ఉగ్రదాడి మృతులకు నివాళిగా ఆస్ట్రేలియా జాతీయ సంతాప దినం పాటిస్తున్న రోజే ఈ కాల్పులు జరగడం గమనార్హం. కాల్పుల నేపథ్యంలో స్థానికులను పోలీసులు అప్రమత్తం చేశారు. ఘటనా జరిగిన ప్రదేశానికి వెళ్లొద్దని, ఇళ్లలోనే ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉండగా.. గత ఏడాది డిసెంబరు 14న సిడ్నీలోని బోండీ బీచ్‌లో యూదులు ఉత్సవంపై ఇద్దరు వ్యక్తులు కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. ఈ దాడిలో 15 మంది మృతి చెందారు. నిందితులను సాజిద్ అక్రమ్, అతడి కుమారుడు నవీద్ అక్రమ్‌గా గుర్తించారు. పోలీసుల ఎదురు కాల్పుల్లో సాజిద్ హతమవ్వగా.. నవీద్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వీరికి ఐసిస్‌తో సంబంధాలున్నట్లు అధికారులు చెప్పారు.

# ప్రపంచంలో రెండో అత్యంత ట్రాఫిక్ రద్దీ నగరంగా బెంగళూరు



**బెంగళూరు :** గత ఏడాదికి సంబంధించి ప్రపంచంలోనే అత్యంత ట్రాఫిక్ రద్దీ నగరంగా మెక్సికోలోని మెక్సికో సిటీ నిలిచింది. రెండో స్థానంలో కర్ణాటక రాజధాని బెంగళూరు ఉంది. ఈ నగరంలో 10 కిలోమీటర్ల ప్రయాణానికి సగటున 36 నిమిషాలకుపైగా సమయం పట్టినట్లు 'టామ్‌టామ్ ట్రాఫిక్ సూచీ-2025'లో వెల్లడైంది. డబ్లిన్ (ఐర్లాండ్), లోడ్జ్ (పోలండ్), పుణె (భారత్)లు టాప్-5లో ఉన్నాయి. బెంగళూ రులో సగటు రద్దీ స్థాయి 74.4 శాతంగా నమోదైంది. 2024తో పోలిస్తే 1.7 శాతం పెరిగింది. వాహనదారులు 15 నిమిషాల్లో సగటున 4.2 కిలోమీటర్ల దూరం ప్రయా ణించారు. 10 కిలోమీటర్ల ప్రయాణానికి సగటున 36 నిమిషా ల తొమ్మిది సెకన్ల సమయం పట్టింది. అత్యంత రద్దీ వేళల్లో సగటు వేగం గంటకు 13.9 కిలోమీటర్లకు పడిపోయిందని నివేదిక పేర్కొంది. ముఖ్యంగా 2025 మే 17న బెంగళూరులో ట్రాఫిక్ పరిస్థితి దారుణంగా ఉందని, ఆ రోజు సగటు రద్దీ స్థాయి 101 శాతంగా నమోదైనట్లు నివేదిక తెలిపింది. సా యంత్రం 6 గంటల సమయంలో వాహనదారులు 15 నిమిషాల్లో 2.5 కిలోమీటర్లే ప్రయాణించినట్లు వెల్లడించింది. ఈ జాబితాలో ముంబయి (18), దిల్లీ (23), కోల్‌కతా (29), జైపుర్(30), చెన్నై(32), హైదరాబాద్(47) స్థానాల్లో నిలిచా యి. హైదరాబాద్‌లో గంటకు సగటు వేగం 18.4 కిలోమీ టర్లుగా ఉందని నివేదిక పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా దాదా పు 500 నగరాల్లో, 3.65 ట్రిలియన్ కిలోమీటర్లకుపైగా ప్రయాణ డేటా ఆధారంగా ఈ నివేదిక రూపొందించినట్లు సంస్థ తెలిపింది.

# గ్రీన్‌లాండ్‌తో మాకు పని లేదు : పుతిన్



**రష్యా :** గ్రీన్‌లాండ్ భద్రతకు రష్యా, చైనా నుంచి ముప్పు ఉందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోపణలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ పరిణామాలపై తాజాగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్పందించారు. గ్రీన్‌లాండ్ వ్యవహారంతో తమకు సంబంధం లేదని పేర్కొన్నారు. రష్యాలో జరిగిన ఓ కార్యక్రమంలో పుతిన్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. గ్రీన్ లాండ్‌పై ప్రస్తుతం జరుగుతున్న వ్యవహారంతో తమకు పని లేదన్నారు. ఈ సమస్యను అమెరికా, డెన్మార్క్‌లు కలిసి పరిష్కరించుకుంటాయని ఆశిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా డెన్మార్క్ గ్రీన్‌లాండ్‌ను ఒక భాగంగా మాత్రమే చూస్తోందని, దానిపై వివక్ష చూపించడం లేదని వ్యాఖ్యానించారు. అయితే, ఈ వ్యవహారంపై ఎవరూ ఆసక్తి చూపిస్తున్నారని తాను అనుకోవడం లేదన్నారు. ఈ క్రమంలో ఇతరుల భూభాగాలను స్వాధీనం చేసుకోవడంలో అమెరికాకు సుదీర్ఘ చరిత్ర ఉందన్నారు. గ్రీన్ లాండ్ కొనుగోలుకు దాదాపు 1 బిలియన్ డాలర్ల వరకు ఖర్చవుతుందని.. ఆ మొత్తాన్ని భరించగల సామర్థ్యం అగ్రరాజ్యానికి ఉందని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా 1867లో అలస్కాను రష్యా 7.2 మిలియన్ డాలర్లకు యూఎస్‌కు విక్రయించిన విషయాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు.

### శాంతి మండలిపై విభిన్న ప్రకటనలు..

గాజా పునర్నిర్మాణానికి సంబంధించి ట్రంప్ శాంతి మండలిని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో చేరేందుకు పుతిన్ అంగీకరించారని ట్రంప్ ప్రకటించారు. అయితే, ఈ ప్రతిపాదనను ఇంకా పరిశీలిస్తున్నామని తాజాగా పుతిన్ స్పష్టం చేశారు. వ్యూహాత్మక భాగస్వాములతో సంప్రదించిన తర్వాతే దీనిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈక్రమంలో మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం అమెరికా స్తంభింపజేసిన తమ ఆస్తుల నుంచి 1 బిలియన్ డాలర్లు విరాళంగా ఇస్తామని తెలిపారు.

# విజయ్ పార్టీ గుర్తు 'విజిల్'



**న్యూఢిల్లీ :** తమిళనాడు అసెంబ్లీకి కొన్ని నెలల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో నటుడు విజయ్ పార్టీ తమిళిగ వెట్రి కళగం (టీవీకే)కు ఎన్నికల సంఘం గురువారం విజిల్ గుర్తును కేటాయించింది. అలాగే మరో నటుడు కమల్‌హాసన్ పార్టీ మక్కల్ నీది మయ్యంకు 'బ్యాటరీ టార్చ్' గుర్తును కేటాయించినట్లు వెల్లడించింది. తమ పార్టీకి ఎన్నికల గుర్తు కేటాయించాలని కోరుతూ టీవీకే నవంబర్ 11న ఈసీని ఆశ్రయించింది. శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గుర్తింపుపొందని రాజకీయ పార్టీలు గుర్తు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల కమిషన్ సూచించిన నేపథ్యంలో వినతిని సమర్పించింది. అలాగే కమల్ పార్టీ నవంబర్‌లో వినతి పత్రం అందించింది. ఈ రెండు పార్టీలు కొన్ని చిహ్నాలు ఉన్న జాబితాను అందించి, వాటిలో ఒకదానిని కేటాయించాలని విజ్ఞప్తి చేశాయి. 2019 లోక్ సభ ఎన్నికలు, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఎన్ఎం ఈ బ్యాటరీ టార్చ్ గుర్తుపైనే పోటీ చేసింది. తమిళంతో పాటు తెలుగులోనూ ఫ్యాన్ ఫాలోయింగ్‌ను సొంతం చేసుకున్న కథానాయకుడు విజయ్. ఆయన నటించిన సినిమాలు తెలుగులోనూ విడుదల అవుతుంటాయి. ఫుట్‌బాల్ ఆట నేపథ్యంలో అట్లీ దర్శకత్వం వహించిన బిగిల్ సినిమా.. మన దగ్గర 'విజిల్' పేరుతో రిలీజ్ అయిన సంగతి తెలిసిందే. ఈ సినిమా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఇప్పుడు ఇదే పేరుతో ఉన్న గుర్తుతో విజయ్ తొలిసారి ఎన్నికల బరిలోకి దిగుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.



# 'టీమ్ ఇండియా' అని పిలవొద్దంటూ పిటిషన్

## సుప్రీంకోర్టు ఆగ్రహం

**న్యూఢిల్లీ :** బీసీసీఐ నేతృత్వంలో ఏర్పాటైన జట్టును 'టీమ్ ఇండియా'గా అభివర్ణించకుండా ప్రసారభారతికి ఆదేశాలివ్వాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇలాంటి పిటిషన్లతో కోర్టులపై భారం మోపొద్దంటూ పిటిషనర్‌కు చురకలంటించింది. న్యాయవాది రీపక్ కన్సల్ ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ప్రైవేటు సంస్థ అయిన బీసీసీఐ నేతృత్వంలోని జట్టును 'టీమ్ ఇండియా' 'భారత జాతీయ జట్టు' అని పిలవడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని పేర్కొన్నారు. దీనికి కేంద్రం నుంచి కూడా ఎలాంటి అనుమతులు లేవని వాదించారు. దీనిపై ధర్మాసనం అసహనం వ్యక్తంచేస్తూ.. పిటిషన్‌ను కొట్టివేసింది. 'మీరు ఇంట్లో కూర్చుని ఇలాంటి పిటిషన్లు తయారుచేస్తున్నారు. ఈ పేరుతో మీకు వచ్చిన సమస్య ఏంటి?' అని ధర్మాసనం న్యాయవాదిని ప్రశ్నించింది. దేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ ప్రతిచోటా ఆ జట్టు ఆడుతున్న విషయాన్ని ప్రస్తావించింది. ఈ పిటిషన్ దాఖలు చేయడం కోర్టు సమయంతో పాటు మీ సమయాన్ని కూడా వృథా చేయడమేనని మండిపడింది.

# ఒడిశాలో పొగాకు ఉత్పత్తులపై నిషేధం



**భువనేశ్వర్:** పొగాకు ఉత్పత్తులపై ఒడిశా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నికోటిన్ కలిగి ఉండే గుట్కా, పాన్ మసాలా, జర్దా, ఖైనీ వంటి ఉత్పత్తుల తయారీ, విక్రయం, నిల్వ, రవాణాపై రాష్ట్రవ్యాప్తంగా పూర్తి స్థాయిలో నిషేధం విధించింది. ఈ మేరకు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని, పొగాకు రహిత రాష్ట్రంగా ఒడిశాను తీర్చిదిద్దేందుకు సహకరించాలని పౌరులకు విజ్ఞప్తి చేసింది. ఒడిశాలో 42 శాతానికి పైగా పౌరులు సిగరెటేతర పొగాకును వినియోగిస్తున్నట్లు ఓ సర్వేలో తేలింది. ఇది జాతీయ సగటు కంటే అధికం. ఈ నేపథ్యంలో ఒడిశా ప్రభుత్వం పౌరుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకుంది.

# అవును.. వెనెజువెలాపై 'రహస్య ఆయుధం' వాడాం : ట్రంప్



**వాషింగ్టన్ :** వెనెజువెలాపై మెరుపుదాడి చేసి ఆ దేశ నేత నికోలస్ మదురో, ఆయన భార్యను అమెరికా దళాలు నిర్బంధించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో అగ్రరాజ్యం ఓ రహస్య ఆయుధాన్ని ఉపయోగించినట్లు కథనాలు వచ్చాయి. ఈ అంశంపై ట్రంప్ తాజాగా స్పందించారు. సీక్రెట్ సోనిక్ వెపన్ ను వినియోగించినట్లు ధ్రువీకరించారు. తమవద్దే ఈ తరహా శక్తిమంతమైన ఆయుధం ఉందని.. మరే దేశం వద్ద ఇలాంటి సాంకేతికత లేదని అర్థం వచ్చేలా వ్యాఖ్యలు చేశారు. "మన దగ్గర ఎవరికీ తెలియని ఆయుధాలు ఉన్నాయి. వాటి గురించి ఎక్కువగా మాట్లాడకపోవడమే మంచిదని భావిస్తున్నాను. అదొక అద్భుతమైన దాడి" అని ట్రంప్ ఓ మీడియా సంస్థతో మాట్లాడారు. మదురోను కస్టడీలోకి తీసుకునేందుకు నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో యూఎస్ అత్యంత శక్తిమంతమైన ఆయుధాన్ని వాడిందని ఇటీవల ఆ మాజీ అధ్యక్షుడికి అత్యంత సన్నిహితంగా పనిచేసిన గార్డ్ చెప్పిన వివరాలు ప్రపంచాన్ని ఆశ్చర్యపర్చాయి. "మా ముక్కుల నుంచి రక్తం కారడం మొదలైంది. కొందరు వాంతులు చేసుకున్నారు. ఇంకొందరు నేలపై పడిపోయారు. ఆ సోనిక్ ఆయుధం ముందు మేం నిల్చోలేకపోయాం. అగ్రరాజ్యంతో పోరాడగలమని ఎవరైనా అనుకుంటే అది భ్రమే అవుతుంది" అని ఆందోళన వ్యక్తంచేశాడు. ఓ మీడియా సంస్థ ప్రచురించిన ఈ వ్యాఖ్యలను వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు. దాంతో ఈ ఆయుధం వార్తలు ప్రపంచం దృష్టిని ఆకర్షించాయి.

# ఈయూ దేశాలపై టారిఫ్‌లు

## వెనక్కి తగ్గిన ట్రంప్

**వాషింగ్టన్ :** గ్రీన్‌లాండ్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆచితూచి అడుగులు వేస్తున్నారు. దాని స్వాధీనానికి బలప్రయోగం చేయ-ంబోమని దావోస్ వేదికగా చెప్పిన ట్రంప్.. తాజాగా సుంకాల విషయంలో వెనక్కి తగ్గారు. నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టెతో ద్వైపాక్షిక సమావేశం అనంతరం ట్రంప్ ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. గ్రీన్‌లాండ్ విషయంలో తమకు మద్దతు తెలపని ఈయూ దేశాలపై అదనపు సుంకాలు విధిస్తానని గతంలో ట్రంప్ బెదిరింపులకు పాల్పడ్డారు. దీన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు తాజాగా తన సొంత ట్రూత్ సోషల్ వేదికగా పోస్టు పెట్టారు. "నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టెతో చాలా ఫలప్రదమైన చర్చలు జరిగాయి. గ్రీన్ లాండ్, ఆర్కిటిక్ ప్రాంత భవిష్యత్తు ఒప్పందానికి ఓ ఫ్రేమ్ వర్క్ రూపొందించాం. ఇది కార్యరూపం దాల్చితే అమెరికాతో పాటు నాటో మిత్ర దేశాలకు కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. అందుకే సుంకాలపై నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నాం. ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి రావాల్సిన సుంకాలను విధించడం లేదు. 'గోల్డెన్ డోమ్' నిర్మాణం పైనా చర్చలు కొనసాగుతున్నాయి. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో, ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్‌లు దీనికి సంబంధించిన చర్చలు జరుపుతున్నారు" అని ట్రంప్ పేర్కొన్నారు. సుంకాలు విధించబోనంటూ ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని డెన్మార్క్ విదేశాంగ మంత్రి లార్స్ లోకే రాస్ముసెన్ స్వాగతించారు. ఇది చాలా సానుకూలమైన పరిణామంగా పేర్కొన్నారు.

# 'వీజీ-జీరాంజీ'కి పాతపేరే కొనసాగించాలి : రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ :** జాతీయ ఉపాధి హామీ పథకంలో గాంధీ పేరు తొలగించి 'వీబీ-జీరాంజీ'పేరుతో కొత్త చట్టం తేవడాన్ని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తప్పుబట్టారు. పేదల పని హక్కులను హరించడమే భాజపా ప్రధాన ఉద్దేశమని ఆరోపించారు. దిల్లీలో నిర్వహించిన ఉపాధి హామీ కార్మికుల సదస్సులో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో రాచరిక పాలనను ప్రవేశపెట్టాలని మోదీ ప్రభుత్వం భావిస్తోందన్నారు."గతంలోనూ రైతుల హక్కులను కాలరాసేందుకు కేంద్ర వ్యవసాయ రంగంలో మూడు చట్టాలను తీసుకొ చ్చింది. అన్నదాతల ఆందోళనలతో వెనక్కి తగ్గింది. అదే మాదిరిగా ఇప్పుడు పేద కూలీలపై 'వీబీ జీరాంజీ'పేరుతో వారి పని హక్కులను హరించాలని చూస్తోంది. దేశంలో ప్రతిదీ రాజు (ప్రధాని) మాత్రమే నిర్ణయించాలనే కొత్త సిద్ధాంతాన్ని భాజపా సృష్టిస్తోంది"అని ఆరోపించారు. వీజీ-జీరాంజీ పథకాన్ని రద్దుచేసి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలన్న డిమాండ్‌తో కాంగ్రెస్ పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమైంది. ఈ నెల 10 నుంచి ఫిబ్రవరి 25 వరకు దేశవ్యాప్తంగా 'ఎంజీనరేగా బచావో సంగ్రాం' ఆందోళన కార్యక్రమం చేపడుతున్న విషయం తెలిసిందే.



# లోయలో పడిన ఆర్మీ వాహనం..

## 10 మంది మృతి

**దోడా :** జమ్మూకశ్మీర్‌లోని దోడా జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. భద్రతా సిబ్బంది వెళ్తున్న ఓ వాహనం అదుపుతప్పి లోయలో పడింది. ఈ ఘటనలో 10 మంది ఆర్మీ సిబ్బంది ప్రాణాలు కోల్పోగా.. మరి కొందరు గాయపడ్డారు. భదేర్వాహ్-చంబా రోడ్డులోని ఖన్నీ పర్వత ప్రాంతంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. లోయలో పడిపోయిన బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో 17 మంది భద్రతా సిబ్బంది ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. వెంటనే రంగం లోకి దిగిన ఆర్మీ, పోలీసులు సంయుక్తంగా రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాయి. గాయపడిన వారిని ఉధంపుర్ మిలిటరీ ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు పేర్కొన్నారు.

# మూడు రోజుల నష్టాలకు బ్రేక్



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. ఈయూపై విధించిన టారిఫ్‌లపై ట్రంప్ వెనక్కి తగ్గడం, భారత్‌తో త్వరలో అద్భుతమైన ట్రేడ్ డీల్ ఉండబోతోందంటూ దావోస్ వేదికగా ఆయన చేసిన ప్రకటన మార్కెట్‌లో ఉత్సాహాన్ని నింపింది. దీంతో మూడు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ వేస్తూ సూచీలు లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 82,459.66 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,909.63) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 82,783.18 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 397.74 పాయింట్ల లాభంతో 82,307.37 వద్ద ముగిసింది. నిఫ్టీ 132.40 పాయింట్ల లాభంతో 25,289.90 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్ కనిష్ఠాల నుంచి కాస్త కోలుకుని 91.62గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో బీఈఎల్, టాటా స్టీల్, అదానీ పోర్ట్స్, ఎస్‌బీఐ, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఎటర్నెల్, టైటాన్, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64.55 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4824 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.






## ఆరోగ్య అత్యవసరాల్లో
# పర్సనల్ లోన్

ప్రతిఒక్కరికీ ఏదోఒక సందర్భంలో అత్యవసరంగా నగదు అవసరాలు ఏర్పడుతుంటాయి. ఇలాంటి సందర్భాల్లో ఎక్కువమంది వ్యక్తిగత రుణం తీసుకోవడానికే మొగ్గు చూపుతుంటారు. అయితే, పర్సనల్ లోన్లు తీసుకోవడంలో వైద్య అత్యవసర పరిస్థితులు కీలక భూమిక పోషిస్తున్నాయని ఓ నివేదిక పేర్కొంది. ముఖ్యంగా అర్బన్ ప్రాంతాల్లో ఈ కారణం చూపుతూ వ్యక్తిగత రుణాలు ఎక్కువగా తీసుకుంటున్నారని 'పైసా బజార్' తన నివేదికలో పేర్కొంది. ఈ మేరకు 'ది పర్సనల్ లోన్ స్టోరీ' పేరిట ఓ నివేదికను విడుదల చేసింది. దేశంలో వ్యక్తిగత రుణాలు తీసుకుంటున్న వారిలో 11 శాతం మంది ఆరోగ్య అత్యవసర, వైద్యం కోసం ఖర్చు చేస్తున్నట్లు తేలింది. టైర్- 1 నగరాల్లో ఇది 14 శాతంగా ఉంది. టైర్-2లో 10 శాతం, టైర్-3 నగరాల్లో ఇది 8 శాతంగా ఉంది. ఆరోగ్య బీమా కవరేజీ తక్కువగా ఉండడం, వైద్య ఖర్చులను నేరుగా చెల్లించాల్సి రావడం, వైద్య ద్రవ్యోల్బణం కీలక భూమిక పోషిస్తున్నాయని నివేదిక పేర్కొంది. ఇందుకోసం దేశంలోని 23 నగరాల్లో నివసిస్తున్న 2,889 మంది నుంచి అభిప్రాయాలు సేకరించింది.

### ఇవీ కారణాలు..

- దేశ జనాభాలో ఇప్పటికీ 40-42 శాతం మందికి మాత్రమే ఆరోగ్య బీమా కవరేజీ ఉండడం దీనికి కారణం. హెల్త్ ఇన్సూరెన్స్‌పై అవగాహన పెరుగుతున్నప్పటికీ.. ఇంకా కవరేజీ పరిధిలోకి రానివారి సంఖ్య ఎక్కువగా ఉందనేది ఈ నివేదిక చెబుతోంది.
- ఒక్కోసారి ఆరోగ్యబీమా పాలసీ ఉన్నప్పటికీ.. అందులో ఉండే కో-పే ఆప్షన్, సబ్-లిమిట్స్, కవరేజీ పరిధిలోకి రాని చికిత్సలు/టెస్టుల వల్ల ఇప్పటికీ కొంతమొత్తం నగదు రూపంలో చెల్లించాల్సి వస్తోంది. మొత్తం ఖర్చులో 40 శాతం జేబు నుంచే చెల్లించాల్సి వస్తోందని నివేదిక పేర్కొంటోంది.
- దేశంలో వైద్య ద్రవ్యోల్బణం వేగంగా పెరుగుతోంది. ఏడాదికి 12-15 శాతం మేర పెరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇతర ఆసియా దేశాలతో పోలిస్తే భారత్‌లో వైద్య ఖర్చులు వేగంగా పెరుగుతున్నాయి.

### పర్సనల్‌లోనే ఎందుకంటే?

- వ్యక్తిగత రుణాలు వేగంగా మంజూరవుతాయి. 24-48 గంటల్లోనే డబ్బు చేతికందుతుంది. డిజిటల్ రూపంలో అయితే క్షణాల్లోనే నగదు ఖాతాలో జమ అవుతోంది. పైగా దీనికి ఎలాంటి తనఖా అవసరం లేదు. 5 ఏళ్ల కాలవ్యవధి వరకు చెల్లింపుల వ్యవధిని ఎంచుకోవచ్చు. ప్రైవేటు రుణాలతో పోలిస్తే తక్కువ వడ్డీకే రుణాలు లభిస్తుండడంతో వీటివైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నట్లు పైసా బజార్ పేర్కొంది.
- వైద్య ఖర్చులు కాకుండా 48 శాతం మంది అవసరమైన ఖర్చులు, 36% శాతం మంది ఆకాంక్షలు/లైఫ్‌స్టైల్ కోసం, 16% మంది వ్యాపార పెట్టుబడుల కోసం, 11% వివాహాలు, ఉత్సవాల కోసం ఖర్చు చేస్తున్నట్లు నివేదిక పేర్కొంది. ఆన్‌లైన్‌లో 32 శాతం మంది రుణాలు తీసుకుంటుండగా.. ఇప్పటికీ 68 శాతం మంది బ్యాంకు శాఖల్లోనే రుణాలు తీసుకోవడానికి ఇష్టపడుతున్నారని నివేదిక పేర్కొంది.



## 'కరచాలనం'పై
# పాక్ విషప్రచారం

పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్, పాక్ జట్ల మధ్య 'కరచాలన' అంశంపై చర్చ కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఆసియా కప్ 2025లో పాక్‌తో భారత్ మూడుసార్లు తలపడింది. టాస్ సమయంలో, మ్యాచ్ ముగిసిన తర్వాత టీం ఇండియా ఆటగాళ్లు పాక్ ప్లేయర్లకు షేక్‌హ్యాండ్ ఇవ్వలేదు. కొన్నాళ్లకు దీని గురించి అంతా మర్చిపోయారు. అయితే, పాక్ మళ్లీ ఈ వివాదాన్ని తెరపైకి తెచ్చింది. జనవరి 29 నుంచి పాకిస్థాన్, ఆస్ట్రేలియా మధ్య మూడు టీ20ల సిరీస్ ప్రారంభంకానుంది. ఈ సిరీస్ కోసం పీసీబీ ఓ ప్రోమో విడుదల చేసింది. వీడియో చివర్లో భారత్‌ను కవ్వించేలా కరచాలన వివాదాన్ని పాక్ పరోక్షంగా ప్రస్తావించింది. ఇంతకీ ఆ ప్రోమో చివర్లో ఏముందంటే.. ఓ ఆస్ట్రేలియా టూరిస్ట్ కారు దిగి డ్రైవర్‌కు షేక్‌హ్యాండ్ ఇవ్వకుండా ముందుకు వెళ్లిపోతాడు. దీనిపై వివాదాస్పదవ్యాఖ్యలు ప్రోమోలో ఉండటం పాక్ కుటిలబుద్ధికి అద్దం పడుతోంది. ఆసియా కప్ 2025లో భారత్, పాక్ మధ్య మూడు మ్యాచ్‌లు జరగ్గా.. అన్నింట్లో టీం ఇండియానే విజయం సాధించింది. దాయాది దేశంతో జరిగిన ఫైనల్‌లో భారత్ 5 వికెట్ల తేడాతో గెలిచి ఛాంపియన్‌గా నిలిచింది. ఏసీసీ ఛైర్మన్ మోసిన్ నఖ్వీ చేతులమీదుగా టైటిల్ అందుకోవడానికి భారత ఆటగాళ్లు నిరాకరించారు. ఇప్పటికీ ట్రోఫీ భారత్‌కు రాలేదు.



# చరిత్ర సృష్టించిన పీవీ సింధు

భారత బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు తన కెరీర్‌లో 500 మ్యాచ్ విజయాలు సొంతం చేసుకుంది. ఈ ఘనత సాధించిన ఆరో వుమెన్స్ సింగిల్స్ షట్లర్‌గా, తొలి భారతీయురాలిగా రికార్డ్ సృష్టించింది. దీనికి ఇండోనేసియా సూపర్ 500 టోర్నమెంట్ ప్రీక్వార్టర్ ఫైనల్స్ వేదికైంది. గురువారం ఈ పోరులో ఆమె డెన్మార్క్‌కు చెందిన లైన్ హోజ్‌మార్క్ జాయర్‌ఫెల్డ్‌ను ఓడించింది. ప్రారంభ రౌండ్‌లో జపాన్‌కు చెందిన అన్‌సీడెడ్ మనామీ సుయిజు చేతిలో ఓడిపోయిన సింధు, లైన్ హోజ్‌మార్క్‌పై మాత్రం పూర్తి ఆధిపత్యం చెలాయించింది. 43 నిమిషాల్లో 21-19, 21-18 తేడాతో డానిష్ షట్లర్‌ను వరుసగా ఓడించింది. ఇప్పటివరకు జరిగిన ఆరు మ్యాచుల్లో సింధుకు లైన్‌పై ఇది అయిదో గెలుపు. ఈ ప్రదర్శనతోనే సింధు 500 విజయాల మార్క్‌ను అందుకుంది. ఇటీవల మలేసియా ఓపెన్ సూపర్ 1000లో సింధు సెమీఫైనల్‌లో నిష్క్రమించిన విషయం తెలిసిందే. అలాగే గత వారం ఇండియా ఓపెన్‌లో మొదటి రౌండ్‌లోనే వెనుదిరిగి నిరాశ పరిచింది. ప్రపంచ 13వ ర్యాంకులో ఉన్న సింధు ప్రస్తుత టోర్నీలో.. టాప్ సీడ్, ప్రపంచ నం.4వ స్థానంలో ఉన్న చైనా క్రీడాకారిణి చెన్ యు ఫీతో తలపడనుంది. సింధు, ఫీ ఇప్పటివరకు 13 సార్లు ఒకరినొకరు ఎదుర్కొన్నారు. 7 మ్యాచుల్లో సింధు విజయం సాధిస్తే, 6 మ్యాచుల్లో ఫీ గెలుపొందింది. సింధు.. ఫీ పై చివరిసారిగా 2019లో విజయం సాధించింది. తన తదుపరి పోరులో ఆమెపై గెలిచి.. తన రికార్డ్‌ను మెరుగుపరుచుకోవాలని సింధు ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

## బంగ్లాదేశ్ జట్టు భారత్‌కు వచ్చి
# మ్యాచ్‌లు ఆడాల్సిందే..
### బంగ్లా విజ్ఞప్తిని పట్టించుకోని ఐసీసీ

- తమ జట్టు భారత్‌కు వెళ్లబోదు : స్పష్టం చేసిన బీసీబీ
- బంగ్లాదేశ్ స్థానంలో స్కాట్లాండ్ ఆడే అవకాశం



భారత్‌లో జరగనున్న 2026 టీ20 ప్రపంచ కప్ మ్యాచ్‌లు ఆడకూడదని బంగ్లాదేశ్ నిర్ణయం తీసుకుంది. తమ మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలన్న బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) అభ్యర్థనను బుధవారం ఐసీసీ తిరస్కరించింది. ఈ నేపథ్యంలో గురువారం సమావేశమైన బీసీబీ ప్రస్తుత పరిస్థితుల్లో తమ జట్టు భారత్‌కు వెళ్లబోదని మరోసారి స్పష్టం చేసింది. టోర్నీ ఆడటానికి తమకు ఆసక్తి ఉందని, కానీ తమ మ్యాచ్‌లు భారత్‌లో నిర్వహించొద్దని పేర్కొంది. వేదికల తరలింపు అంశంపై ప్రతిష్ఠంభన తొలగించడానికి ఐసీసీతో సంప్రదింపులు జరుపుతామని బీసీబీ తెలిపింది. 'ఐసీసీ మాకు న్యాయం చేయలేదు. ఇది క్రికెట్‌కు సంబంధించిన అంశం మాత్రమే కాదు. మా ఆటగాళ్ల భద్రత విషయంలో వెనకడుగు వేయం' అని బంగ్లాదేశ్ క్రీడా సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ అన్నారు. వచ్చే నెల 7న ఆరంభమయ్యే టీ20 ప్రపంచకప్‌నకు భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి. 20 జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీ కోసం బంగ్లాదేశ్.. భారత్‌కు రాని పక్షంలో ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్‌ను ఆడించాలని ఐసీసీ భావిస్తోంది. అంతే కాక బంగ్లాపై ఐసీసీ చర్యలు కూడా చేపట్టే అవకాశముంది. ఈ టోర్నీ ఆదాయంలో తమ వాటాను కోల్పోవడంతో పాటు జరిమానాను కూడా బంగ్లా క్రికెట్ బోర్డు (బీసీబీ) ఎదుర్కోవాల్సి రావచ్చు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడుల నేపథ్యంలో భారత అభిమానుల నుంచి తీవ్ర వ్యతిరేకత రాగా, బీసీసీఐ ఆ దేశ ఫాస్ట్ బౌలర్ ముస్తాఫిజుర్‌ను ఐపీఎల్ నుంచి తప్పించడంతో వివాదం రాజుకుంది. ప్రతిగా భారత్‌లో తమ భద్రతకు ముప్పు ఉందనే సాకుతో తమ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలని బీసీబీ.. ఐసీసీకి విజ్ఞప్తి చేసింది. ఆ వినతిని తిరస్కరించిన ఐసీసీ భారత్‌కు వచ్చి మ్యాచ్‌లు ఆడాల్సిందేనని స్పష్టం చేసింది. ప్రస్తుత పరిణామాలను బట్టి చూస్తే బంగ్లాదేశ్ స్థానంలో స్కాట్లాండ్ టీ20 ప్రపంచ కప్‌లో ఆడే అవకాశముంది.

## టీమ్ఇండియాను కలవరపెడుతున్న
# ఫీల్డింగ్ వైఫల్యాలు



కివీస్‌పై తొలి టీ20లో టీమ్ఇండియా విజయమైతే సాధించింది. అయితే.. మన ఫీల్డింగ్ వైఫల్యాలు కలవరపాటుకు గురిచేశాయి. స్కోర్ బోర్డు మీద భారీ స్కోర్ ఉంది కాబట్టి.. పెద్దగా ఇబ్బంది పడలేదు కానీ.. మనం కూడా ఓ 20, 30 పరుగులు తక్కువ చేసి ఉంటే.. పరిస్థితి మరోలా ఉండేది. ఫీల్డర్లు అందివచ్చిన అవకాశాలను జారవిడవడమే దీనికి కారణం. ఈ మ్యాచ్‌లో భారత్.. బ్యాటింగ్, బౌలింగ్‌లో ఆధిపత్యం ప్రదర్శించినప్పటికీ.. ఫీల్డింగ్‌లో మాత్రం కొన్ని పొరపాట్లు చేసింది. మొత్తం ఒక రనౌట్.. రెండు క్యాచ్‌లను మన క్రికెటర్లు జారవిడిచారు. పొట్టి ఫార్మాట్లో లీడింగ్‌లో ఉన్న ఓ జట్టుకు ఇలాంటి ఫీల్డింగ్ అసలేమాత్రం ఆమోదయోగ్యం కాదు. సోషల్ మీడియాలోనూ పలువురు టీమ్ఇండియా అభిమానులు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మ్యాచులు గెలవాలంటే క్యాచ్‌లు పట్టాల్సిందే. బౌలింగ్, బ్యాటింగ్‌తో పాటు ఫీల్డింగ్‌లోనూ మెరుపులు రావాల్సిందే. కానీ.. మొదటి టీ20లో కివీస్ బ్యాటింగ్ చేస్తున్నప్పుడు 11వ ఓవర్లో జస్‌ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లో మార్క్ చాప్‌మన్ ఇచ్చిన తేలికైన క్యాచ్‌ను రింకు సింగ్ వదిలేశాడు. అలాగే 19వ ఓవర్లో అర్షదీప్ సింగ్ బౌలింగ్‌లో మిచెల్ శాంట్నర్ ఇచ్చిన లడ్డూలాంటి క్యాచ్‌ను ఇషాన్ కిషన్ నేలపాలు చేశాడు. మొదటి ఓవర్లో అర్షదీప్ సింగ్ బౌలింగ్‌లో.. కివీస్ ఓపెనర్ డెవన్ కాన్వే (0) ఇచ్చిన క్యాచ్‌ను వికెట్ కీపర్ సంజు శాంసన్ ఒడిసి పట్టాడు. కానీ.. శివమ్ దూబె బౌలింగ్‌లో (9.1) గ్లెన్ ఫిలిప్స్‌ను రనౌట్ చేసే అవకాశాన్ని సంజు మిస్ చేశాడు. రింకు సింగ్ వేసిన త్రోను సంజు శాంసన్ సరిగా పట్టుకోలేకపోయాడు. 40 పరుగుల వద్ద లైఫ్ పొందిన గ్లెన్ ఫిలిప్స్ (78) కివీస్ ఇన్నింగ్స్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. భారీ సిక్స్‌లతో కాసేపు భయపెట్టాడు! కానీ చివరికి అక్షర్ పటేల్ బౌలింగ్‌లో వెనుదిరగడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. మరి కొన్ని రోజుల్లోనే టీ20 వరల్డ్ కప్ ప్రారంభం కానున్న నేపథ్యంలో తన ఫీల్డింగ్ మీద తగినంత దృష్టి నిలపాల్సిన అవసరాన్ని ఈ ఫీల్డింగ్ వైఫల్యాలు ఎత్తి చూపుతున్నాయి. అలాగే మెగా టోర్నీకి ముందు ఈ టీ20 సిరీస్‌లో ప్రతికూల ఫలితాలొస్తే.. టీమ్ఇండియా ఆటగాళ్ల ఆత్మస్థైర్యం దెబ్బతినే అవకాశమూ ఉంది. అందుకే అప్రమత్తంగా ఉండాలని పలువురు క్రికెట్ విశ్లేషకులు భారత జట్టుకు సూచిస్తున్నారు.

## అదే అతడికీ, నాకూ ఉన్న తేడా: సునీల్ గావస్కర్



భారత టీ20 స్పెషలిస్ట్ బ్యాటర్ అభిషేక్ శర్మను మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ కొనియాడాడు. 'నేను మొదటి పరుగు చేయడానికి ఎన్ని బంతులు ఎదుర్కొంటానో.. అన్ని బంతుల్లో అభిషేక్ శర్మ హాఫ్‌సెంచరీ సాధించేశాడు. మా ఇద్దరి మధ్య చాలా తేడా ఉంది.' అని సునీల్ గావస్కర్ అన్నాడు. నాగ్‌పూర్ మ్యాచ్‌లో మరో ఓపెనర్ సంజు శాంసన్(10), ఇషాన్ కిషన్(8) త్వరత్వరగా పెవిలియన్‌కు చేరారు. టీమ్ఇండియా 1.5 ఓవర్లకు 18 పరుగుల వద్ద తొలి వికెట్, 2.5 ఓవర్లకు 27 రన్స్ వద్ద రెండో వికెట్ కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో కనబడింది. ఇలాంటి పరిస్థితుల్లో అభిషేక్ శర్మ ఏమాత్రం తన దూకుడు తగ్గించకుండా బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌తో కలిసి మూడో వికెట్‌కు 47 బంతుల్లోనే 99 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు.



## ఇండిగోకు 'డిసెంబర్' దెబ్బ..
### లాభంలో 78 శాతం క్షీణత

దిల్లీ: ఇండిగో మాతృ సంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ గురువారం త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ రూ.549.1 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.2448.8 కోట్ల లాభంతో పోలిస్తే 78 శాతం క్షీణత నమోదైంది. కొత్తగా తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లు, గతేడాది డిసెంబర్‌లో తలెత్తిన విమాన సేవల్లో అంతరాయం వంటివి లాభాలపై ప్రభావం చూపాయి. కొత్త కార్మిక చట్టాల అమలుకు రూ.969 కోట్లు, కార్యకలాపాల అంతరాయాల కారణంగా రూ.577 కోట్లు ఖర్చయినట్లు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. మొత్తంగా ఈ త్రైమాసికంలో రూ.1546 కోట్లు ప్రభావం పడినట్లు పేర్కొంది. కరెన్సీ లావాదేవీలకు సంబంధించి డాలర్ ఆధారిత భవిష్యత్ చెల్లింపుల కోసం మరో రూ.1,035 కోట్లను డిసెంబర్ త్రైమాసికంలో మినహాయించినట్లు ఇండిగో పేర్కొంది. మొత్తం ఆదాయం రూ.24,540.6 కోట్లుగా నమోదైంది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.22,992.8 కోట్లతో పోలిస్తే కాస్త పెరిగింది. గతేడాది డిసెంబర్‌లో వందలాది విమాన సర్వీసులను ఇండిగో రద్దు చేసిన సంగతి తెలిసిందే. దీంతో వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో టికెట్ మొత్తాలను కంపెనీ రిఫండ్ చేసింది. ప్రయాణికులకు పరిహారం చెల్లించడంతో పాటు, గుడ్‌వెల్ గెశ్చర్ ఓచర్ల కింద ఒక్కో ప్రయాణికుడికి రూ.10వేలు చొప్పున చెల్లిస్తామని హామీ ఇచ్చింది. దీంతో పాటు ఇటీవల డీజీసీఏ ఇండిగోకు రూ.22 కోట్ల జరిమానా విధించడంతో పాటు రూ.50 కోట్లు బ్యాంక్ గ్యారెంటీ చెల్లించాలని ఆదేశించింది. ఫిబ్రవరి 10 వరకు వింటర్ షెడ్యూల్‌లో 10 శాతం కోత పెట్టింది. ఈ ప్రభావం తాజా త్రైమాసిక ఫలితాల్లో కనిపించింది. రాబోయే త్రైమాసికంలోన ఈ ప్రభావం పడొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక



## బోర్డర్-2 విడుదలకు

# గల్ఫ్ దేశాలు నిరాకరణ ?



సన్నీ డియోల్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'బోర్డర్ 2' జనవరి 23న శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తాజాగా దీనికి సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో షేర్ అవుతోంది. ఆరు గల్ఫ్ దేశాల్లో 'బోర్డర్ 2' పై నిషేధం విధించినట్లు వార్తలు వస్తున్నాయి. బహ్రెయిన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియాతో పాటు యూఏఈ లోనూ 'బోర్డర్ 2'ను నిషేధించినట్లు తెలుస్తోంది. గల్ఫ్‌లోని అన్ని థియేటర్లలో దీన్ని విడుదల చేయడానికి నిర్మాతలు ప్రయత్నిస్తున్నట్లు బాలీవుడ్ మీడియా పేర్కొంది. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా తెరకెక్కించడం వల్లే ఆయా దేశాలు దీన్ని బ్యాన్ చేసినట్లు తెలుస్తోంది గతేడాది చివర్లో విడుదలై సంచలనం సృష్టిస్తోన్న 'ధురంధర్'పై కూడా ఈ దేశాలు బ్యాన్ విధించిన విషయం తెలిసిందే. దీనిపై జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ చిత్రబృందం ప్రధాని మోదీకి కూడా లేఖ రాసింది. దీన్ని ఎక్కడైనా విడుదల చేసుకోవచ్చని ఎలాంటి అభ్యంతరకర సన్నివేశాలు లేవని సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ ఇచ్చిందని.. ఆ దేశాల్లో దీనిపై నిషేధం విధించడం భావ ప్రకటనా స్వేచ్ఛను అణచివేయడమేనని ఆ లేఖలో మూవీటీమ్ పేర్కొంది. 'బోర్డర్ 2' విషయానికొస్తే.. భారత్– పాకిస్థాన్ యుద్ధం నేపథ్యంతో తెరకెక్కిన హిట్ మూవీ 'బోర్డర్' 28 ఏళ్ల తర్వాత దానికి సీక్వెల్‌గా రూపొందింది సన్నీ దేవోల్ ప్రధాన పాత్రలో తొలి పార్ట్‌ను జె.పి.దత్తా తెరకెక్కించగా.. రెండో భాగాన్ని అనురాగ్ సింగ్ రూపొందించారు. సీక్వెల్‌లో వరుణ్ ధావన్, దిల్జీత్ దొసాంజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

## చిరు మూవీలో

# కృతిశెట్టి

'వాల్తేరు వీరయ్య' తర్వాత అగ్ర కథానాయకుడు చిరంజీవి, దర్శకుడు బాబీ కలిసి మరో సినిమా చేయబోతున్నారు. . కూతురు సెంటిమెంట్ ప్రధానంగా సాగే కథతో ఈ చిత్రం రూపొందనున్నట్టు సమాచారం. ఇందులో కూతురు పాత్ర కోసం కృతిశెట్టి ఎంపిక దాదాపు ఖరారైనట్టు తెలుస్తోంది. ఈ సినిమాలోనే మలయాళ స్టార్ మమ్ముట్టి కూడా ఓ కీలక పాత్రని పోషిస్తున్నారు. దీనిపై త్వరలోనే ప్రకటన రానుంది.

## పవన్‌కల్యాణ్‌తో సినిమా చేయాలని

# ఉత్సాహంగా ఉంది

### వచ్చే సంక్రాంతికి కొత్త సినిమా కచ్చితంగా ఉంటుంది : అనిల్ రావిపూడి



**తన తర్వాతి చిత్రం కూడా 200శాతం ఎంటర్‌టైనరేనని దర్శకుడు అనిల్ రావిపూడి వెల్లడించారు. ఆయన దర్శకత్వంలో చిరంజీవి కథానాయకుడిగా నటించిన తాజా మూవీ 'మన శంకరవరప్రసాద్‌గారు'. నయనతార కథానాయిక. వెంకటేశ్ కీలక పాత్ర పోషించారు. సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లు (గ్రాస్) వసూలు చేసింది. ఈ నేపథ్యంలో అనిల్ రావిపూడి విలేకరులతో ముచ్చటించారు. 'శంకర వరప్రసాద్ గారు' విశేషాలతో పాటు తన తర్వాత సినిమా గురించి కూడా ప్రస్తావించారు.**

#### ఈ మూవీలో చేసిన మార్పు ఆ ఒక్కటే..

"వరప్రసాద్ గారు' కన్నా ముందే వేరే కథ అనుకుంటే అది మిస్ ఫైర్ అయింది. దీంతో తక్కువ సమయంలో స్క్రిప్ట్ పూర్తి చేశాం. అదే సమయంలో మంచి హిట్ కొట్టాలనే ఒత్తిడి మాత్రం మాపై ఉంది. సినిమా విషయంలో పెద్దగా మార్పులు చేయలేదు. ముందుగా అనుకున్న వెర్షన్‌లో నాయిక నాయకు లు విడిపోయిన కథ ముందు వచ్చి ఆ తర్వాత లవ్‌స్టోరీ వచ్చేది. కానీ, ఎడిటింగ్ తర్వాత శశిరేఖతో లవ్ ఎపిసోడ్ ఫస్ట్ తీసుకొచ్చి, ఆ తర్వాత విడిపోయిన కథను చెప్పాం"

#### టైటిలే విచిత్రంగా ఉంటుంది..


"ఇది నాకు కాస్త క్లిష్టమైన సమయం. ఎం దుకంటే, 'సంక్రాంతికి వస్తున్నాం' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత నేను చేసిన ఈ మూవీ ఒక ఎత్తయితే.. రెండు భారీ హిట్‌ల తర్వాత చేయబోయే సి నిమా అంటే కచ్చితంగా తిక మక ఉంటుంది. అది చేయాలా? ఇది చేయాలా ? అనే ఆలోచనలు ఎక్కువైపోతాయి. ఈ క్రమంలో సరైన నిర్ణయాలు తీసుకోపోతే, దారి తప్పుతాం. అందుకే వారం పది రోజులు విరామమిచ్చా. తాజాగా వైజాగ్ టూర్‌లో ఒక ఆలోచన పట్టుకున్నాం. ఈసారి సినిమా టైటిల్ ప్రకటన నుంచే ఒక విచిత్రమైన జర్నీ ప్రారంభం కాబోతోంది. ఇది చూసి చాలా మంది 'వామ్మో ఇదేంట్రా బాబూ' అనుకోవచ్చు. 'హమ్మయ్యా ఇంకో దానితో వస్తున్నాడు రా' అనుకునేవాళ్లూ ఉంటారు. కచ్చితంగా ఒక మేజిక్ జరగబోతోంది. టైటిలే విచిత్రంగా ఉంటుంది"

#### పవన్‌కల్యాణ్‌తో చేస్తే సంతోషమే..

"కొత్త సినిమాకు సంబంధించి నటీనటులు ఎవరనేది ఇంకా అనుకోలేదు. స్టోరీ లైన్ మాత్రమే ఫిక్స్ అయ్యా. అందులో ఎవరు చేస్తే బాగుంటుంది? ఎవరెవరి డేట్స్ ఉంటాయి?అనేది చూసుకోవాలి. నటీనటుల వెసులుబాటు ముఖ్యం కదా. జూన్, జులై నాటికి సినిమా సెట్స్ పైకి వెళ్తుంది. పవన్ కల్యాణ్ గారిని నేరుగా కలవలేదు. ఆయనతో సినిమా చేయాలని ఉత్సాహంగా ఉంది. ఆయన ఏపీ డిప్యూటీ సీఎంగా చాలా బిజీగా ఉన్నారు. ప్రస్తుతం ఇండస్ట్రీలో రెగ్యులర్‌గా సినిమాలు చేసే స్టార్ కాదు కదా! ఆయనకు చాలా పనులు ఉన్నాయి. ఒకవేళ మా కాంబినేషన్ కుదిరితే సంతోషమే. ఏం జరుగుతుందో చూద్దాం. ఇప్పటివరకూ అయితే, ఎలాంటి ఆలోచనా లేదు"

#### ప్రయోగాలు ఎందుకు..?

"ప్రేక్షకులు ఎంటర్ టైనర్స్‌ను కోరుకుంటున్నారు. నేను చేయబోయే తర్వాతి చిత్రం కూడా 200శాతం ఎంటర్‌టైనర్. దానికి ఎమోషన్ జోడించి ఎలాగూ చెబుతాం. ఈ జానర్‌ను ప్రేక్షకులు ఆదరిస్తున్నప్పుడు అది వదిలేసి ప్రయోగాలు చేయాలనుకోవడం లేదు. కాకపోతే, తీసిన కథనే మళ్లీ తీయను. కొత్త కోణాన్ని పట్టుకోవాలి. 'సంక్రాంతికి వస్తున్నాం', 'శంకర్ వరప్రసాద్ గారు' రెండు ఒకలా కనిపించవు. వీటికి భిన్నంగా మూడోది ఉండాలి. అన్నీ కుదిరితే వచ్చే సంక్రాంతికి కొత్త సినిమా కచ్చితంగా ఉంటుంది. ఇప్పుడు చేయబోయే మూవీ తర్వాత 'భగవంత్ కేసరి'లా డిఫరెంట్ జానర్‌లో మూవీ చేస్తా. అందులో ఒక సర్ ప్రైజ్ ఉంది. అది ఇప్పుడే చెప్పలేను. ఈ సినిమా అయ్యాక ఆ వివరాలు వెల్లడిస్తా. తెలుగు రాష్ట్రాల ప్రేక్షకులతో పాటు, ప్రవాస తెలుగువారు కూడా నా సినిమాలను ఆదరిస్తున్నారు. త్వరలోనే అమెరికా వెళ్లి వారికి ధన్యవాదాలు చెబుతా. 'ఎఫ్ 2' నుంచి నన్ను ఆదరిస్తున్న ప్రవాసులకు ధన్యవాదాలు" అని అనిల్ రావిపూడి అన్నారు.




## విశాల్ మూవీ మొగుడు

# ప్రోమో విడుదల

తమిళ నటుడు విశాల్ మరో కొత్త సినిమాతో రాబోతున్నాడు. ఆయన కెరీర్‌లో 36వ చిత్రంగా రాబోతున్న ఈ సినిమాకు సంబంధించి అప్‌డేట్‌ను వెల్లడించింది చిత్రబృందం. ఈ సినిమాకు హిట్ డైరెక్టర్ సుందర్ సి దర్శకత్వం వహించబోతుండగా.. వీరిద్దరి కాంబినేషన్‌లో రాబోతున్న నాలుగవ చిత్రమిది. ఈ సినిమాకు తెలుగులో 'మొగుడు' అనే ఇంట్రెస్టింగ్ టైటిల్‌ను ఖరారు చేస్తూ ప్రోమోను విడుదల విడుదల చేసింది. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'మగ మహారాజు', 'మదగజరాజా', 'యాక్షన్' సినిమాల తరహాలోనే ఈ సినిమా కూడా భారీ అంచనాలతో రూపొందుతోంది. ఈ సినిమాలో తమన్నా భాటియా హీరోయిన్‌గా నటిస్తుండగా, యోగిబాబు ఒక కీలక పాత్రలో అలరించబోతున్నారు. తాజాగా విడుదలైన ప్రోమో ఫుల్ ఫన్నీగా మరియు మాస్ యాక్షన్ ప్యాక్డ్‌గా ఉంది. ముఖ్యంగా 'మొగుడులా ఉండటం ముఖ్యం కాదు.. మొగుడు మొగుడులా ఉండటమే ముఖ్యం' అంటూ యోగిబాబు చెప్పే డైలాగ్ నవ్వులు పూయిస్తోంది. ఇందులో తమన్నా భర్తను శాసించే భార్యగా కనిపిస్తుంటే, విశాల్ ఇంట్లో పనులు చేసే అమాయకపు భర్తగా నటిస్తూనే.. భార్యకు తెలియకుండా బయట విలన్ల తాట తీసే మాస్ క్యారెక్టర్‌లో అదరగొట్టాడు.

## హిందీలో సక్రాంతికి వస్తున్నాం

### రాశీఖన్నాకి అవకాశం


దక్షిణాదితోపాటు అటు హిందీలోనూ అప్పుడప్పుడూ అవకాశాల్ని అందుకుంటున్న రాశీఖన్నాకి అక్షయ్‌కుమార్‌తో కలిసి నటించే అవకాశం సొంతమైనట్టు సమాచారం. తెలుగులో విజయవంతమైన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాని హిందీలో అక్షయ్ కుమార్ కథానాయకుడిగా రీమేక్ చేస్తున్నారు. ఇందులో భార్య పాత్రలో విద్యాబాలన్ నటిస్తుండగా, ప్రియురాలి పాత్రలో రాశీఖన్నా నటించనున్నట్టు సమాచారం. తెలుగులో మీనాక్షి చౌదరి చేసిన పాత్ర రాశి సొంతమైందన్నమాట. మొదట మీనాక్షి పేరునే పరిశీలించిన చిత్రబృందం, ఆ తర్వాత ఆ పాత్ర కోసం రాశిని ఎంపిక చేసినట్టు తెలుస్తోంది.



## ఓటిటి నెట్‌ఫ్లిక్స్‌లోకి

# దురంధర్

బాలీవుడ్‌లో ఎలాంటి భారీ అంచనాలు లేకుండా విడుదలై సంచలన విజయాన్ని నమోదు చేసిన లేటెస్ట్ సెన్సేషన్ 'దురంధర్'. దర్శకుడు ఆదిత్య ధర్ తెరకెక్కించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఊహించని రీతిలో దూసుకెళ్లింది. ఇండియన్ ఆర్మీ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిన ఈ యాక్షన్ డ్రామా ఇప్పటివరకు ప్రపంచ వ్యాప్తంగా రూ.1400 కోట్లకు పైగా వసూళు సాధించి సరికొత్త రికార్డ్స్ క్రియేట్ చేసింది. ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్ పవర్‌ఫుల్ పాత్రలో నటించి మరోసారి తన స్టార్‌డమ్‌ను నిరూపించుకోగా, సారా అర్జున్ హీరోయిన్‌గా ఆకట్టుకుంది. అలాగే అక్షయ్ ఖన్నా చేసిన స్పెషల్ రోల్ సినిమాకు ప్రధాన బలంగా నిలిచింది. దురంధర్ మూవీ త్వరలోనే ఓటీటీలో విడుదల కానుంది. ఈ సినిమా ఓటీటీ హక్కులను ప్రముఖ స్ట్రీమింగ్ సంస్థ నెట్‌ఫ్లిక్స్ దక్కించుకున్న విషయం తెలిసిందే. తాజా సమాచారం ప్రకారం జనవరి 30 నుంచి దురంధర్ సినిమాను నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ చేయనున్నారు. ఈ వార్త బయటకు రావడంతో థియేటర్లలో చూడలేకపోయిన ప్రేక్షకులతో పాటు, ఇప్పటికే చూసినవాళ్లు కూడా మళ్లీ మళ్లీ చూడాలని ఆసక్తి చూపిస్తున్నారు. ఓటీటీలో ఈ సినిమాకు భారీ డిమాండ్ ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. థియేటర్ కలెక్షన్లతోనే కాదు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోనూ కొత్త రికార్డ్స్ క్రియేట్ చేయడం ఖాయమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక ఈ సినిమాకు సీక్వెల్ కూడా రాబోతున్న విషయం తెలిసిందే. దురంధర్ సీక్వెల్‌ను మార్చి 19న విడుదల చేయనున్నట్టుగా మేకర్స్ ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు.




Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com